

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఉత్తరాంధ్ర

విశాఖపట్నం, శ్రీకాకుళం విజయనగరం

బుధవారం 25-02-2026 పేజీలు: 19

# ఆధ్యాత్మిక శోభతో చందనోత్సవం



2వ పేజీలో

# కలవరపెడుతున్న ఆపరేషన్ లంగ్స్ 3.0!

➢ ఇన్నాళ్లూ ఇష్టారాజ్యంగా సెల్లార్ల ఆక్రమణ ➢ జీవీఎంసీ కొరడాతో వ్యాపారుల్లో అలజడి ➢ రెండ్రోజుల్లో 12 ఆక్రమణలను తొలగించిన టౌన్ప్లానింగ్ అధికారులు




3వ పేజీలో

# రాకాసి రహదారులు

- యామపాసలుగా రోడ్లు - ప్రమాదాలకు నిలయంగా విశాఖ నగరం- ప్రజల ప్రాణాలహరిస్తున్న మృత్యుకుహరాలు - వరుస రోడ్డు ప్రమాదాలతో హాలెక్కిపోతున్న ప్రజలు - నిర్లక్ష్యంతో మరికొన్ని ప్రమాదాలు - ట్రాఫిక్ పోలీసుల ప్లాన్ అట్రా ప్లాప్..!



6 లో

# చెత్త నుంచి సంపద లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

: కొమ్మారెడ్డి పట్టాభిరామ్

- దేశంలోనే తొలి సమగ్ర పాలసీ - జంతు వ్యర్థాల ప్రాసెసింగ్‌కు ప్రత్యేక కేటగిరీ - కాలుష్య నియంత్రణకు సాంకేతికతే మార్గం - పర్యావరణ సంక్షోభంపై కలెక్టర్ ఆందోళన




2వ పేజీలో

# భార్యను కడతీర్చిన భర్త

– ఆరిలొవ బాలాజీ నగర్‌లో దారుణం – అనుమానం తో హత్య – భర్తపై కేసు నమోదు – సీఐ మల్లేశ్వరావు కేసు దర్యాప్తు



3వ పేజీలో

# ఆధ్యాత్మిక శోభతో చందనోత్సవం...

**- నిర్వహణకు సమగ్ర ప్రణాళిక - చందనోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ - మార్చి 31లోపు పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ ఈవో కి అదేశాలు - సాధారణ భక్తులకు ప్రాధాన్యం,దర్శనానికి విస్తృత సమయాలు - రద్దీ నియంత్రణకు ప్రత్యేక క్యూ లైన్లు - భద్రతపై ప్రత్యేక దృష్టి - శాశ్వత షెల్టర్లు,అగ్ని భద్రత తనిఖీలు తప్పనిసరి**

**సింహాచలం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** నిత్యం ఆధ్యాత్మిక కాంతులతో కాసరగొలిపే సింహాచలం క్షేత్రం మరోసారి చందన సుగంధంతో మైమరచే వేళకు సిద్ధమవుతోంది.వచ్చే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి వార్షిక చందనోత్సవాన్ని అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సమగ్ర కార్యాచరణను అమలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకటరావుతో కలిసి కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులు, క్యూ లైన్ల నిర్మాణాలు, బారికేడింగ్ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్ని సివిల్ పనులను మార్చి 31లోపు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

### - భక్తుల సౌకర్యమే లక్ష్యం

ఈ ఏడాది సుమారు 1.20 లక్షల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నట్లు అంచనా.సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఉదయం 3 గంటల నుంచి రాత్రి 10--11 గంటల వరకు దర్శనం కల్పించేలా ప్రణాళిక సిద్ధమవుతోంది. ఉదయం 5 గంటలలోపు అంతరాలయ దర్శనాలు పూర్తిచేయాలని ప్రాథమిక నిర్ణయం తీసుకున్నారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు ఉదయం 3 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక సమయాలు కేటాయించనున్నారు. రూ300, రూ1000, రూ1500 దర్శనాల కోసం వేర్వేరు ప్రాంతాల నుంచి క్యూ లైన్లు ప్రారంభించి రద్దీ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

### - శాశ్వత షెల్టర్లు, కట్టుదిట్టమైన భద్రత

గతంలో గాలులు, వర్షాల వల్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్ల వెంట శాశ్వత షెల్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.విద్యుత్, అగ్ని భద్రత తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు.రవాణా పార్కింగ్‌పై స్పష్టమైన ప్రణాళిక భక్తుల రాకపోకలకు ప్రత్యేక బస్సులు,పికప్ డ్రాప్ పాయింట్లు,విస్తృత పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటుపై స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. దర్శనం అనంతరం భక్తులు వేగంగా బయటకు వెళ్లేందుకు ఆగమశాస్త్రం ప్రకారం అదనపు ర్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.

### - సెల్‌ఫోన్లకు నిషేధం

ఆలయ ప్రాంగణంలో సెల్‌ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది, సేవా వలంటీర్లతో నిరంతర పర్యవేక్షణ కొనసాగించనున్నారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి స్వాగతం పలికి కప్పస్తంభమాలింగనం నిర్వహించగా, వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు.అనంతరం స్వామివారి ప్రసాదాలు సమర్పించారు. చందనోత్సవ వేళ సింహాచలం క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో వెలుగొందేలా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా కొనసాగుతున్నాయి..

### - గత ఏడాది తప్పులు మళ్లీ జరగవు : కలెక్టర్ హరేంద్ర ప్రసాద్

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం, సింహాచలంలో జరిగే చందనోత్సవాన్ని ఈసారి పూర్తిస్థాయి ప్రణాళికతో, కట్టుదిట్టమైన పర్యవేక్షణలో నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ స్పష్టం చేశారు.గత ఏడాది వాతావరణ ప్రతికూలతలు, క్యూ లైన్లలో ఏర్పడిన ఇబ్బందులు వంటి అంశాలను విశ్లేషించి, వాటి పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.క్యూ లైన్ల వద్ద శాశ్వత షెల్టర్లు, బలమైన బారికేడింగ్,విద్యుత్ అగ్ని భద్రత తనిఖీలు తప్పనిసరి చేశామని పేర్కొన్నారు. సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ దర్శన సమయాలను విస్తరించామని, రద్దీ నియంత్రణకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా,ప్రశాంత వాతావరణంలో స్వామివారి దర్శనం కల్పించడం మా ప్రథమ కర్తవ్యం అని కలెక్టర్ భరోసా ఇచ్చారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఆలయ అధికారులతో పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు.

# ఘనంగా ఎల్లమ్మ తీర్థ మహోత్సవం...



**ఆనందపురం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలం పొడుగు పాలెం గ్రామంలో ఘనంగా ఎల్లమ్మ తీర్థ మహోత్సవం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను క్యూలైన్ ద్వారా దర్శన సౌకర్యం కల్పించడం జరిగింది. తీర్థ మహోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘ పెట్టడం జరిగింది. గ్రామస్తుల ఐకమత్యంతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం చూపరులను మంత్రముగ్ధులు చేసింది. ప్రతి యాట కంటే ఈ సంవత్సరం భక్తులు అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున రావడం జరిగిందని ఉత్సవ కమిటీ తెలిపింది.

# పేదల ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలి

**- సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

**- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్**




**విశాఖసిటీ, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** జిల్లాలో పేద ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం బ్యాంకర్లు విస్తృతంగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ లిఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌లి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) సమావేశంలో ఆయన అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించాలని సూచించారు. ముఖ్యంగా విద్యా రుణాలు, ఎంఎస్‌ఎంఈ యూనిట్లు, పీఎం స్వానిధి, ఇన్వెస్ట్మెంట్ క్రెడిట్ కింద రుణాల మంజూరులో చురుకుదనం చూపాలన్నారు. పీఎంఈజీపి పథకంలో అన్ని బ్యాంకులు తమ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. టిడ్కో గృహాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రుణాలను వేగవంతంగా మంజూరు చేయాలని సూచించారు. సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తున్న పథకాల కింద పేదలకు పెద్ద ఎత్తున రుణాలు అందించాలని పేర్కొన్నారు. మార్చి 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాటికి ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు రుణాలు మంజూరు చేసి గ్రౌండింగ్ పూర్తి చేయాలని బ్యాంకర్లు, పరిశ్రమల శాఖ అధికారులకు ఆదేశించారు. యూసీడీ, డీఆర్‌డీఏ అధికారులు ప్రతి 15 రోజులకు ఒకసారి స్వయం సహాయక సంఘాల మహిళలు, బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించి రుణాల మంజూరులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

### - సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

రోజురోజుకు సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఖాతాదారులను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పెద్ద మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరిగే సమయంలో బ్యాంకులు జాగ్రత్తగా పరిశీలన చేయాలని సూచించారు. మోసాలకు గురైన బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. సమావేశం ప్రారంభంలో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు స్థితిని సమీక్షించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, జిల్లాకు రూ.74,317 కోట్ల రుణ ప్రణాళిక లక్ష్యం కాగా, రూ.81 వేల కోట్ల రుణాలు మంజూరు చేసి 110 శాతం లక్ష్య సాధన చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, నాబార్డ్ మేనేజర్ సమంత కుమార్, ఆర్బీఐ ఎల్‌డీఓ నవీన్ కుమార్, పీడీ డీఆర్‌డీఏ లక్ష్మీపతి, పీడీ యూసీడీ సరోజినీ, జీఎం ఇండస్ట్రీస్ ఆదిశేషు, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త నుంచి సంపద లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

**: కొమ్మారెడ్డి పట్టాభిరామ్**

**విశాఖసిటీ, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ ద్వారా సుస్థిరాభివృద్ధి సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. “వెల్త్ ఫ్రమ్ వేస్ట్ ” భావనతో చెత్త నుంచి సంపద సృష్టించడంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని తెలిపారు. పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను పర్యావరణ హిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)--ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో “సర్క్యులర్ ఎకానమీ ఢ గ్రీన్ కంపెనీస్” అంశంపై విశాఖపట్నంలోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2050 నాటికి దేశంలో సర్క్యులర్ ఎకానమీ విలువ సుమారు 2 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని, ఈ రంగం ద్వారా 10 మిలియన్లకు పైగా ఉపాధి అవకాశాలు లభించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

### - దేశంలోనే తొలి సమగ్ర పాలసీ

దేశంలోనే తొలిసారిగా సమగ్ర సర్క్యులర్ ఎకానమీ పాలసీ, మార్గదర్శకాలు విడుదల చేసిన ఘనత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదేనని పట్టాభిరామ్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఈ విధానం రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. ‘స్వర్ణాంధ్ర విజన్ 2047’లో “స్వచ్ఛాంధ్ర”కు ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 5 సర్క్యులర్ ఎకానమీ పార్కులు, 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డ్రై వేస్ట్‌ను ప్లాస్టిక్, గ్లాస్, కార్డ్‌బోర్డ్, ఈ-వేస్ట్ తదితర 10 రకాలుగా వర్గీకరించి రీసైక్లింగ్ పరిశ్రమలకు సరఫరా చేస్తున్నామని వివరించారు.

### - జంతు వ్యర్థాల ప్రాసెసింగ్‌కు ప్రత్యేక కేటగిరీ

కేంద్రం సూచించిన 11 కేటగిరీలకు అదనంగా జంతు వ్యర్థాల ప్రాసెసింగ్‌ను 12వ కేటగిరీగా చేర్చినట్లు తెలిపారు. విశాఖపట్నం, గుంటూరులో రోజుకు 100 టన్నుల సామర్థ్యం గల ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రోజుకు 1300--1400 టన్నుల



పౌల్ట్రీ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో వాటి శాస్త్రీయ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రీసైక్లింగ్ పరిశ్రమలకు ముడి పదార్థాల లభ్యతపై రియల్ టైమ్ సమాచారం అందించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్‌ను రూపొందిస్తున్నామని, విజయవాడలో సర్క్యులర్ ఎకానమీపై “సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్” ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

### - కాలుష్య నియంత్రణకు సాంకేతికతే మార్గం

ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతోనే కాలుష్య నియంత్రణ సాధ్యమని పేర్కొన్నారు. రీసైక్లింగ్ విధానాలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు స్వర్ణావకాశమని అన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలితో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### - పర్యావరణ సంక్షోభంపై కలెక్టర్ ఆందోళన

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ విశాఖపట్నంలో సముద్ర మట్టం పెరుగుదల, గాలి నాణ్యత క్షీణతపై ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నమోదైన అధిక (ఏక్యూఐ) స్థాయిని గుర్తు చేస్తూ తక్షణ చర్యలు అవసరమని అన్నారు. ప్లాస్టిక్ రహిత నగర లక్ష్యంతో బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. గ్రీన్ హైడ్రోజన్, బయోగ్యాస్ రంగాల్లో యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సదస్సులో సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, పరిశ్రమల శాఖ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# మనీ మ్యూల్ ఖాతాల సైబర్ ముఠా అరెస్ట్...!

**- రిటైర్డ్ ప్రొఫెసర్‌కు రూ.1.05 కోట్లు మోసం - కేసు లో ఆరుగురును అరెస్టు చేసిన సైబర్ క్రైం పోలీసులు - నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు - సీపీ డా. శంఖబ్రత బాగ్చి కఠిన ఆదేశాలతో సైబర్ క్రైమ్ దాడులు**

**విశాఖ క్రైం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** డిజిటల్ అరెస్ట్,స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న అంతర్రాష్ట్ర,అంతర్జాతీయ సైబర్ నేర జాలాన్ని విశాఖ సైబర్ క్రైం పోలీసులు ఛేదించారు. సైబర్ నేరగాళ్లకు "మనీ మ్యూల్" బ్యాంక్ ఖాతాలను సరఫరా చేస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించింది. విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు చేపట్టిన లోతైన సాంకేతిక దర్యాప్తులో ఈ కీలక పురోగతి సాధ్యమైంది. విదేశాల నుంచి మోసాల ఆపరేషన్ దేశంలో మ్యూల్ ఖాతాల వల పోలీసుల వెల్లడింపుల ప్రకారం, ప్రధాన సైబర్ నేరగాళ్లు కంబోడియా, మయన్మార్, చైనా, పాకిస్థాన్, నైజీరియా వంటి దేశాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మోసం ద్వారా వచ్చిన డబ్బును నేరుగా తమ ఖాతాలకు మళ్లించకుండా, దేశంలో ఉన్న వ్యక్తుల పేర్లపై తెరిచిన కరెంట్ కార్పొరేట్ ఖాతాల ద్వారా పలు దశల్లో బదిలీ చేసి,అనంతరం క్రిప్టో కరెన్సీ, హవాలా, విదేశీ రిమిటెన్సుల ద్వారా విదేశాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. మూడు ప్రధాన కేసులు వెలుగులోకి

**- రిటైర్డ్ ప్రొఫెసర్‌కు రూ.1.05 కోట్లు మోసం**

ప్రభుత్వ అధికారులమని నటిస్తూ 67 ఏళ్ల రిటైర్డ్ ప్రొఫెసర్‌ను బెదిరించి విడతల వారీగా రూ.1.05 కోట్లు వసూలు చేశారు. ఇందులో రూ.8 లక్షలు నిడదవోలుకు చెందిన ఖాతాకు బదిలీ అయినట్లు గుర్తించి ముగ్గురిని అరెస్టు చేశారు.

**- 84 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టు పేరిట రూ.89 లక్షలు టోకరా**

సుప్రీంకోర్టు,సీబీఐ అధికారులమని నమ్మబలికి మూడు విడతల్లో రూ.89.30 లక్షలు ఆన్ లైన్ ద్వారా బదిలీ చేయించారు. ఫిర్యాదు ఆధారంగా సాంకేతికంగా ట్రాక్ చేసి విజయనగరానికి చెందిన నిందితుడిని పట్టుకున్నారు. స్టాక్ ట్రేడింగ్ మాయలో రూ.48 లక్షలు ఫేస్‌బుక్ ప్రకటన ద్వారా ట్రేడింగ్ గ్రూప్‌లో చేరిన వ్యక్తి రూ.48.21 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. "గ్లోబల్ టూర్స్ అండ్ వెకేషన్స్" పేరిట తెరిచిన కరెంట్ ఖాతా ద్వారా డబ్బు లేయరింగ్ జరిగినట్లు గుర్తించి ఇద్దరిని అరెస్టు చేశారు.






ల్యాప్‌టాప్, స్వైప్ యంత్రాలు, క్యూ ఆర్ స్కానర్ స్వాధీనం చేసుకున్నారు. మ్యూల్ ఖాతాలు ఎలా వల వేస్తున్నాయి అధిక కమిషన్ ఆశ చూపడం ఫేక్ కంపెనీల పేర్లతో కరెంట్ ఖాతాలు తెరవించడం కాలేజ్ విద్యార్థులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకోవడం ఓటిపి లు, బ్యాంక్ వివరాలు సేకరించడం ఇలా అమాయకులను నేరాలకు అనుకోకుండా భాగస్వాములను చేస్తున్నారు. ప్రజలకు కఠిన హెచ్చరిక సుప్రీంకోర్టు, సీబీఐ, పోలీసులు ఫోన్ ద్వారా డబ్బులు డిమాండ్ చేయరు. కమిషన్ ఇస్తామంటూ ఖాతా వివరాలు అడిగితే వెంటనే అప్రమత్తం కావాలి. ఓటిపిలు, బ్యాంక్ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోరాదు. మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతామని, ప్రధాన మాస్టర్ మైండ్స్ కోసం దర్యాప్తు కొనసాగుతోందని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

# కలవరపెడుతున్న ఆపరేషన్ లంగ్స్ 3.0!

**- ఇన్నాళ్లూ ఇష్టారాజ్యంగా సెల్లార్ల ఆక్రమణ - జీవీఎంసీ కొరడాతో వ్యాపారుల్లో అలజడి - రెండ్రోజుల్లో 12 ఆక్రమణలను తొలగించిన టౌన్లనింగ్ అధికారులు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** దశాబ్దాల తరబడి ఇష్టారాజ్యంగా సెల్లార్లను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్న వారిపై జీవీఎంసీ కమిషనర్ ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే ఫుట్పాత్లను ఆక్రమించుకున్న చిరువ్యాపారుల దుకాణాలను ఆపరేషన్ లంగ్స్ పేరుతో తొలగించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆపరేషన్ లంగ్స్ 3.0 పేరిట సెల్లార్ ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందన్న భావన వ్యక్తమవుతోంది.

**- సెల్లార్ల ఆక్రమణతో ట్రాఫిక్ చిక్కులు..**

విశాఖ నగరంలో జనాభాతో పాటే వాహనాల సంఖ్య పెరుగుతోంది. వివిధ పనులపై వెళ్లే వారు వాణిజ్య సముదాయాల వద్ద అడ్డదిడ్డంగా పార్క్ చేసే వాహనాలతో అవస్థలు పడుతున్నారు. ప్రధాన రోడ్లపైనే కాదు.. నగరంలోని నివాస ప్రాంతాల్లో కొన్ని చోట్ల మినహా వాణిజ్య, వ్యాపార సముదాయాలు, జంక్షన్లలోని అపార్ట్మెంట్ల సెల్లార్లు పార్కింగ్లకు కాకుండా సొంత అవసరాలకు వినియోగించుకుంటున్న వారే అధికంగా ఉన్నారు. దీంతో సెల్లార్ పార్కింగ్లో చోటు లేక ద్విచక్ర వాహనాలు, కార్లను రోడ్ల పక్కన, ఫుట్పాత్లపైన నిలుపుతున్నారు. వాటిని ఛేదించుకుని వెళ్లడం వాహనదార్లకు సాహసమే అవుతోంది. కొన్ని దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇన్నాళ్లూ సెల్లార్లలో ఆక్రమణల తొలగింపునకు జీవీఎంసీ అధికార్లు తూతూమంత్రంగానే చర్యలు చేపడుతున్నారు. నగరంలో సెల్లార్ల ఆక్రమణల వల్ల పడుతున్న ఇబ్బందులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్కు ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో కమిషనర్ సెల్లార్ పార్కింగ్లకు ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించారు.

**- దాని పేరు ఆపరేషన్ లంగ్స్ 3.0..**

ప్రస్తుతం విశాఖలో రెండు లక్షల కార్లు, ఎనిమిది లక్షల వరకు ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. నగరంలో ఒక చోట నుంచి మరో చోటకు వెళ్లాలన్నా, షాపింగ్, సరకుల కొనుగోలుకు వెళ్లాలన్నా పార్కింగే పెద్ద సమస్యగా మారింది. ప్రధాన జంక్షన్లు, వాణిజ్య కూడళ్లు అయిన డాబాగార్డెన్స్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్, సిరిపురం, జిల్లా పరిషత్ జంక్షన్, మద్దిలపాలెం, పూర్ణామార్కెట్, గోపాలపట్నం, గాజువాక ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ఆయా చోట్ల సెల్లార్ పార్కింగ్లో వాహనాలను పార్క్ చేసే పరిస్థితి లేక రోడ్ల పక్కన, ఫుట్పాత్లపైన పార్క్ చేస్తున్నారు. బిల్డింగ్ బైలాస్ ప్రకారం సెల్లార్, బేస్మెంట్ ఫ్లోర్లను. పార్కింగ్లకే తప్ప వాణిజ్యం, నివాసం సహా మరే ఇతర అవసరాలకు వినియోగించకూడదు. పూర్తి



స్థాయిలో వాహనాల పార్కింగ??క కేటాయించాల్సి ఉన్నా చాలామంది వ్యాపారులు అవేమీ పాటించడం లేదు. నగరంలో దాదాపు 300 నిర్మాణాల్లోని సెల్లార్లు ఆక్రమణలకు గురైనట్టు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. వీటిలో వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు, ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. ట్రాఫిక్ సమస్యను సరి చేయడానికి పోలీసులకు రోజూ తల ప్రాణం తోకకు వస్తోంది. ఈ సమస్యకు ఆపరేషన్ లంగ్స్ 3.0తో పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ నిర్ణయించారు.

**- రెండ్రోజుల్లో 12 సెల్లార్ ఆక్రమణల తొలగింపు..**

ఆపరేషన్ లంగ్స్ 3.0ను సోమవారం నుంచి శ్రీకారం చుట్టారు. తొలిరోజు సౌత్ జోన్ డాబాగార్డెన్స్ లో ఒక కమర్షియల్ కాంప్లెక్స్, ఈస్ట్ జోన్ ఎంవీపీ కాలనీలో ఒక వాణిజ్య దుకాణం, వెస్ట్ జోన్ గవర వీధిలో రెండు కూరగాయల షాపులు, 91వ వార్డు బుచ్చిరాజుపాలెం మెయిన్రోడ్డులో క్లోజ్డ్ గ్రిల్స్ను, 66వ వార్డు గాజువాక మెయిన్ రోడ్డులో రెండు వెరసి ఏడు ఆక్రమణలను తొలగించారు. రెండోరోజు మంగళవారం 8వ వార్డు ఎండాడలో ఒకటి, అనకాపల్లి జోన్ 83వ వార్డులో రెండు, గాజువాక జోన్ 67వ వార్డులో రెండు చోట్ల కలిపి ఐదు చోట్ల సెల్లార్ ఆక్రమణలను తొలగించినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు.

**- ఆపరేషన్ లంగ్స్ 3.0 ఆగదు..**

విశాఖ నగరంలో ఆపరేషన్ లంగ్స్ 3.0 కొనసాగుతుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ స్పష్టం చేశారు. ఇప్పటికే పార్కింగ్ కోసం కాకుండా వ్యాపారాలకు వినియోగిస్తున్న సెల్లార్/ స్టిల్ట్ ఫ్లోర్లలో స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. లేనిపక్షంలో వాటిని టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగిస్తారని తెలిపారు. ఆపరేషన్ లంగ్స్ 3.0 పూర్తయితే నగరంలో చాలావరకు ట్రాఫిక్ సమస్యకు ఉపశమనం కలిగినట్టవుతుందన్న ఆనందం విశాఖ వాసుల్లో వ్యక్తమవుతోంది.

# భార్యను కడతీర్చిన భర్త

**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**



విశాఖ ఆరిలోవ బాలాజీ నగర్ ప్రాంతం మంగళవారం ఉదయం హత్య ఘటనతో ఉలిక్కిపడింది. 33 ఏళ్ల దుర్గ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఇది హత్యగా తేలడంతో భర్తపై కేసు నమోదు చేశారు.ఉదయం సుమారు 9 గంటల సమయంలో మృతురాలి తండ్రి నర్సింహులు తన కుమార్తె ఇంటికి వెళ్లగా, తలుపు లోపల నుంచి తాళం వేసి ఉండటంతో అనుమానం వ్యక్తం చేశారు. పలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపు విరగగొట్టి లోపలికి వెళ్లగా, మెడపై గాయాలతో దుర్గ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న అరిలోవ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో భార్యపై అనుమానం పెట్టుకున్న భర్త బురదపాటి దేముడు (42), లైఫ్ స్టైల్ షాపులో ఉద్యోగిగా పనిచేస్తూ, చున్నీతో గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటన అనంతరం పరిస్థితులను ఆత్మహత్యగా చూపించే ప్రయత్నం చేసినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**- సీఐ మల్లేశ్వరావు దర్యాప్తు .. కీలక అంశాలపై దృష్టి**

ఆరిలోవ బాలాజీ నగర్‌లో చోటుచేసుకున్న దుర్గ (33) హత్య కేసును సీఐ మల్లేశ్వరావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఇంటి తలుపు లోపల నుంచి తాళం వేసి ఉండటంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తలుపు తాళం విధానం, గదుల అమరిక, వస్తువుల స్థితి వంటి అంశాలను సవివరంగా పరిశీలించారు. క్లూస్ బృందాన్ని పిలిపించి వేలిముద్రలు, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించారు. మృతురాలి మెడపై ఉన్న గాయాల స్వభావం, వాటి కారణాలపై పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా స్పష్టత తీసుకురావాలని నిర్ణయించారు. కుటుంబ సభ్యులు, పొరుగువారి వాంగ్మూలాలను నమోదు చేసి, దాంపత్య జీవితం సంబంధిత విషయాలను ఆరాతీశారు. భర్త బురదపాటి దేముడిని అదుపులోకి తీసుకుని సంఘటన సమయంలో అతని కదలికలు, ఫోన్ కాల్ వివరాలు, వ్యక్తిగత విభేదాల అంశాలను విచారిస్తున్నారు. ఘటనను ఆత్మహత్యలా చూపించే ప్రయత్నం జరిగిందా? అన్న కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. కేసులో అన్ని కోణాలను పరిశీలిస్తూ పూర్తి నిజానిజాలు వెలికితీసే దిశగా సీఐ మల్లేశ్వరావు దర్యాప్తు ముమ్మరం చేశారు.




## బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాల లక్ష్యంగా ప్రత్యేక చర్యలు

**– జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలు**



**అనకాపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** జిల్లాలోని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల, గ్రామ/వార్డు సచివాలయ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశుభ్రతను కనుచూపుమేర నిలుపుదల చేయడానికి 24 మండలాల్లో ప్రతి మండలానికి 5 గ్రామాలు చొప్పున ఎంపిక చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రావికమతం, రాంబిల్లి, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలో పనిచేస్తున్న ఎంపీడీఓలు, ఉప ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. గ్రామాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా ఉంచడం, ప్రతి ఇంటి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావడం, గ్రామంలోని అన్ని వీధిదీపాలు వెలిగేలా చూడడం, మురుగు కాలువలను శుభ్రపరచడం, తడి చెత్తను చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించి నాడేప్ పిట్స్‌లో వేయడం, ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే గ్రామస్తులకు బహిరంగ మలవిసర్జన చేయవద్దని అవగాహన కల్పించాలని, పొడి చెత్త (ప్లాస్టిక్, పేపర్లు, పుస్తకాలు, ఇనుము, అల్యూమినియం తదితరాలు) స్వచ్ఛ రథం వాహనాలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను ప్రతి రోజు ఉదయం 7.00 గంటల నుండి 10.00 గంటల వరకు, సాయంత్రం 4.00 గంటల నుండి 6.00 గంటల వరకు నిర్వహించాలని గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేయబడినట్లు తెలిపారు.సమావేశంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సందీప్, జిల్లా గ్రామీణ నీటి పారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ అనిల్ కుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ సమన్వయ అధికారి మంజుల వాణి, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.పంచాయతీ కార్యదర్శులు, సహాయ ఇంజనీర్లు సంబంధిత సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్ళు పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్ కు తరలింపు

**– మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరిన స్పీకర్ సతీమణి పద్మావతి**



**నర్సీపట్నం, ఫిబ్రవరి 24 , మేజర్‌న్యూస్:** నర్సీపట్నం మండలం గబ్బాడలో గరగ శ్రీనివాసరావు ద్విచక్రవాహనంను వెనకనుండి ఏపీ 39 డబ్ల్యూ బి 3156 భారత్ బెంజ్ లారీ మంగళవారం ఢీకొట్టడంతో నర్సీపట్నం పీనారిపాలెం కు చెందిన గరగ శ్రీనివాసరావు అనే వ్యాపారి తన వ్యాపారనిమిత్తం గైరంపేట వెళ్తుండగా గబ్బడ వద్ద ద్విచక్ర వాహనాన్నీ వెనుకనుండి టిప్పర్ లారీ ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.ఈఘటనలో ద్విచక్రవాహనదారుని 2 కాళ్ళు నుజ్జునుజ్జయి పోవడంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్సనిమిత్తం అడ్మిట్ చేశారు. విషయం తెలుసుకున్న స్పీకర్ సతీమణి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి వెంటనే స్పందించి ఆసుపత్రిలో శ్రీనివాసరావును పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. శ్రీనివాసరావు పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తమ్మయ్యపేటలో దాహం కేకలు

**– మా గ్రామస్తులకు దాహం తీరేది ఎప్పుడు – విద్యుత్ సరఫరాను నిలిపివేసిన ఏపీఈపీడీసీఎల్ – పట్టించుకోని పంచాయతీ అధికారులు – రుద్రభూమిలో బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న వైనం – మా యాదవ్స్ ఓట్లు వేయడానికి తప్ప మా సమస్యలు పట్టించుకోరా నాయకులు**



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** మండలంలోని దొప్పెర్ల పంచాయతీ శివారు తమ్మయ్యపేట వాసులు గుక్కెడు తాగునీటికి నరకయాతన పడుతున్నారు. చౌర్యం పేరిట బోరుకు విద్యుత్ సరఫరాను తొలగించడంతో గ్రా మానికి తాగునీరందించే బోరు పనిచేయడం లేదు. మూడు నెలలుగా గ్రామస్తు లు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళ్లే. దొప్పెర్ల పంచాయతీ శివారు తమ్మయ్యపేటలో 110కుటుంబాలు నివసిస్తున్నా యి. గ్రామస్థులు తాగునీటిని రుద్దభూమి వద్ద ఉన్న చేతిజోరు నుంచి తెచ్చుకునేవారు. ఈ పరిస్థితిని గమనించిన నాయకులు 2012 జూలైలో రూ.రెం డున్నర లక్షలతో బోరును తవ్వి బుటింటికి కొళాయిలు వేశారు. విద్యుత్ సరఫ రా ఉన్నప్పుడు మాత్రమే మోటారు ద్వారా నీరు వచ్చేది దీనిని గమనించిన గ్రా మస్థులు చందాలు పోగు చేసుకొని ఐదు వేల లీటర్ల నిల్వ సామర్థ్యం గల వాట 5 ట్యాంక్ని సామాజిక భవనంపై ఏర్పాటు చేసుకున్నారు. బోరుద్వారా నీటిని ఈ ట్యాంక్లో నిల్వ చేసి గ్రామస్థులు వాడుకొనేవారు. దీంతో తమ నీటి సమస్య తీరిందని అంతా సంతోషించారు. ఇదిలా ఉండగా ఎటువంటి అనుమతులు లే కుండా బోరుకి విద్యుతిని వినియోగిస్తున్నారంటూ 2025 డిసెంబరులో విద్యుత్

**- రుద్రభూమి వద్ద బోరు నుంచి నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు**

శాఖ విజిలెన్స్ అధికారులు బోరు విద్యుత్ కనెక్షన్ని తొలగించారు. దీంతో వీటి సమస్య ఏర్పడింది. గ్రామస్థులంతా తిరిగి రుద్రభూమి వద్ద బోరు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునేవారు. ఎన్ని అర్జీలు పెట్టినా పంచాయతీతోపాటు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. వేసవికాలం వచ్చినం దున అధికారులు తమ సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతు న్నారు. కూటమికి చెందిన పెద్ద నాయకులు తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## ఏటీఎం కార్డులను మార్చి దొంగతనాలకు పడుతున్న వ్యక్తి నర్సీపట్నంలో అరెస్టులి

**– ఏటీఎం సెంటర్ల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలి... డిఎస్పి శ్రీనివాసరావు**



**నర్సీపట్నం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** నర్సీపట్నంలో వృద్ధులను టార్గెట్ చేసుకొని ఏటీఎం లో వారికి సహాయం చేస్తున్నట్లు నటించి, వారి వద్ద ఉన్న కార్డులను మార్చి ,డబ్బులు స్వాహా చేస్తున్న 19 కేసుల్లో ముద్దాయిగా ఉన్న దొంగను నర్సీపట్నం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. నిపై నర్సీపట్నం టౌన్ స్టేషన్లో డిఎస్పి శ్రీనివాస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె గఫూర్ ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో దొంగను ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు అందించిన వివరాల ప్రకారం గత నెలలో యూనియన్ బ్యాంక్ డి బి ఆర్ బట్టల షాపు దగ్గర ధర్మసాగరం గ్రామానికి చెందిన సుకల నూకరాజు ను ఏటీఎం సెంటర్ వద్ద మోసం చేసి 15 వేలు డబ్బులు కాజేసాడని అందిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి బృందంగా ఏర్పడి సోమవారం స్టేట్ బ్యాంకు వద్ద ముద్దాయిను పట్టుకోవడం జరిగిందని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఏటీఎం కార్డుల ద్వారా ప్రజలను మోసం చేసి 19 కేసులలో ముద్దాయిగా ఉన్న మువ్వ వీరయ్య చౌదరి. సన్నాఫ్ హరిబాబు సొంత గ్రామం వీరన్నపాలెం గ్రామం పరుచూరి మండలం ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తి విశాఖపట్నం 104 ఏరియా మద్రిపాలెం లో వేరొక మహిళతో ఉంటున్నాడని డిఎస్పి తెలిపారు. ఈ వ్యక్తి గత కొన్ని రోజులుగా ఏటీఎంలో దొంగతనాలు చేస్తున్నట్టు గుర్తించడం జరిగిందని డి.ఎస్.పి తెలిపారు. వీరయ్య చౌదరి నర్సీపట్నం స్టేట్ బ్యాంకు వద్ద నేరం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె గఫూర్ కు సమాచారం అందడంతో ముద్దాయిని అరెస్టు చేసినట్లు డిఎస్పి తెలిపారు. ప్రజలు ఏటీఎం సెంట్రల్ వద్ద అప్రమత్తంగా ఉండాలని గుర్తుతెలియని వ్యక్తులకు ఏటీఎం కార్డులు ఇవ్వవద్దని ఎవరిని నమ్మి మోసపోవద్దని డీఎస్పీ తెలిపారు. అనుమానంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ స్థలాన్ని కాజేసిన ఆరుగురు వ్యక్తులు అరెస్టు




**నర్సీపట్నం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** నాతవరం మండలం లింగంపేట గ్రామంలో సర్వే నెంబరు 46 లో గల గ్రామ కంఠం భమిని తప్పుడు పత్రాలు సృష్టించి. తప్పుడు సర్వే నెంబరు చూపించి. తప్పుడు కరెంటు బిల్లులను జతపరిచి ఆరుగురు వ్యక్తులు 12 సెంట్లు గ్రామ కంఠం భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పంచాయతీ కార్యదర్శి బాపూజీ నాతవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా విచారణ నిమిత్తం జాయింట్ యాక్షన్ కమిటీ ఎమ్మార్వో ఓ చందన రేఖ ఎంపీడీవో సత్య శ్రీనివాస వాస్. నాతవరం ఎస్ఐ వై తారకేశ్వరరావు సర్వే నిర్వహించగా ప్రభుత్వ భూమి గా నిర్ధారించడమైనదని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే మోసపూరితంగా తప్పుడు పత్రాలు సమర్పించి ప్రభుత్వ ఆస్తిని స్వాహా చేయడానికి ప్రయత్నం చేసినట్టు రుజువు కావడంతో జాయింట్ యాక్షన్ కమిటీ సర్వేలో నేరం రుజువు కావకావడంతో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామని సర్కిల్ ఇన్స్పెక్టర్ రేవతమ్మ తెలిపారు .ఎమ్మార్వో చందన రేఖ ప్రభుత్వ భూమి ఎలా తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నా రో వివరించారు. గ్రామ కంఠం గా ఉన్న ప్రభుత్వ భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి అరెస్టు అయిన వారిలో లోకవరపు నూకరాజు లోకవరపు మంగ లోకవరపు కొండబాబు లోకవరపు నారాయణమూర్తి పైల సీతారామ నాగ జమీలు లోకవరపు వరహాలు బాబు ఉన్నారని వివరించారు వీరందరినీ కోర్టుకి హాజరు పరుస్తున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ రేవతమ్మ తెలిపారు.







# భోగాపురంలో దాందూ దాందే..






### అవినీతి ఊబిలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

### వరుస దాడులు జరుగుతున్నా భయపడని అధికారులు

### తిమింగలాల లెక్క తేల్చేందుకు ఏసీబీ ఉగ్ర పంజా

**భోగాపురం, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** భోగాపురం పేరు చెప్పగానే దాచుకో దోచుకో అన్న చందంగా ఇక్కడ పనిచేస్తున్న అధికారుల తీరుని తప్పుబడుతున్నారు.. అయితే ఇది వాస్తవమా కాదా అంటే అవుననే చెబుతున్నాయి వివిధ వర్గాలకు చెందిన ప్రజలు. సరిగ్గా రెండు నెలల క్రితమే భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు రోజులపాటు ఏసీబీ సోదాలు నిర్వహించగా ఊహించని పరిణామాలతో ఇక్కడ అధికారితో పాటు ఒక ప్రైవేట్ వ్యక్తి ఇళ్ళల్లో కోట్లు విలువ చేసే ఆస్తులు స్వాధీనం చేసుకున్న సంగతి అందరికీ తెలిసిందే. సరిగ్గా వారం క్రితమే భోగాపురం ఉప తాసిల్దారు సంతకాన్ని ఫోర్జరీ చేసి కోర్టులో ఉన్న విలువైన భూమి పత్రాలపై సంతకం జరిగిందంటూ కలెక్టరేట్ గ్రీవెన్స్ కు వెళ్లడంతో అది ఇంకా విచారణలో కొనసాగుతుంది. గత నెల రోజుల క్రితమే జాతీయ రహదారి పక్కన ఓ చెరువు పూడ్చివేతకు సంబంధించి ఒక ఉన్నతాధికారితో పాటు ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులకు పెద్ద మొత్తంలో నగదు అందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముజేరులో ఓ లేఔట్ వ్యాపారి గెడ్డ కాలువను కప్పివేసినా నేటివరకు దానిపై చర్యలు లేవంటూ కలెక్టరేట్లో గ్రీవెన్స్ కు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. రామచంద్రపేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో గెడ్డను ఆక్రమించి దానిపై నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదంటూ రెవెన్యూ సిబ్బందిపై పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇంత అవినీతి జరుగుతున్నా అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ప్రధానంగా ఇటు రెవెన్యూ అటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇలాంటి అవినీతి చిట్టాలు రోజు రోజుకి పేరుకుపోతున్నాయి. కేవలం రైతునే టార్గెట్ చేసి డబ్బులు గుంజే పాత్రలు ఈ రెండే పోషించడంతో పాటు, వారి వ్యక్తిగత పోషణకు కూడా రైతులనే టార్గెట్ చేస్తున్నారు. ప్రధానంగా భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం ఏ అధికారి వచ్చినా మూడు పువ్వులు.. ఆరుకాయలుగా ఇస్తానుసారం దోపిడీకి తెరలేపుతున్నారన్న ప్రచారం ఉంది. ప్రస్తుతం రెండురోజుల క్రితమే సబ్ రిజిస్ట్రార్ గా ఇంచార్జ్ భాద్యతలు స్వీకరించిన అధికారి పనితీరుపై విమర్శలా ప్రశంసలా వేచి చూడాల్సిందే.

# కొలిక్కి వచ్చిన కాలువ వివాదం

### జల వనరుల శాఖ ఈఈ రమణ జోక్యంతో కాలువ పునర్నిర్మాణానికి చర్యలు





**పూసపాటిరేగ, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** వివాదాస్పదంగా జల వనరుల శాఖ కు సంబంధించిన కాలువ సమస్య సంబంధిత ఈ ఈ ఎంవి రమణ జోక్యంతో సర్దుమనిగింది. నెల్లిమర్ల చంపావతి గ్రోయూర్ నుంచి కుమిలి కాలువ పూసపాటి పాలెం మీదగా కొప్పెర్ల పంట శివారు పొలాలకు వెళ్లాల్సిన కాలువ పాత కుప్పర్ల సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి పూర్తిగా కప్పేయడంతో పూసపాటి పాలెంకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో పూసపాటి పాలెంకు చెందిన రైతులతో పాటు కొప్పెర్ల గ్రామానికి చెందిన రైతులు కూడా మనస్పర్ధలు పెరిగి కాలువ సమస్త పై భిన్నంగా వ్యవహరించడంతో కాలువ సమస్య జటిలంగా మారింది. మూడు నెలలుగా నలుగుతున్న ఈ సమస్య క్షేత్రస్థాయిలో జల వనరుల శాఖ ఏఈ రమేష్ పరిష్కరించక లేకపోవడంతో సమస్య జటిలంగా మారింది. ఇరిగేషన్ సంబంధించిన కాలువను అండర్ గ్రౌండ్ పైపులు వేసి రోడ్డును మలిచే విధంగా రియల్ ఎస్టేట్ దారుడు ప్రయత్నించగా అందుకు కాలువను ఆనుకుని ఉన్న పంట పొలాల రైతులు అడ్డు తగులుతూ వచ్చారు. కాలు సమస్త మరింత జటిలంగా మారడంతో జలవనరుల శాఖ ఈ ఈ ఎంవి రమణ, డిఈ గోవిందరావు, జేఈ రమేష్ లతో కలిసి కప్పేసిన కాలువను మంగళవారం పరిశీలించారు. కాలువకు పైప్ లైన్ వేయకుండా స్లాబ్ కలవట్లేదు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కప్పేసిన రియల్ ఎస్టేట్ కి సంబంధించిన వారికి దిశ నిర్దేశం చేశారు. దగ్గరుండి కాలువ ఎంత మార్కుందా అన్నదానిపై కొలతలు కూడా తీయించే విధంగా చర్యలు చేపట్టారు. కప్పేసిన కాలు స్థానంలో పొడవుగా ఉన్న దానిపై పది మీటర్లు, హైవే పక్కన ఉన్న కాలువకు ఏడు మీటర్ల చొప్పున స్లాబ్ కల్వర్టు నిర్మించాలన్నారు. అలాగే కాలువ పక్కన 100 మీటర్ల వరకు రిటర్నింగ్ వాళ్ళు కూడా నిర్మించేందుకు అంగీకరించారు. బుధవారం నుంచే పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా కప్పేసిన కాలువకు సంబంధించిన వారు హామీ ఇవ్వడంతో ప్రజాప్రతినిధుల సమక్షంలో అంగీకార పత్రాలను కూడా ఇరిగేషన్ ఈ ఈ రమణ రాయించడంతో సమస్య సర్దుమనుకున్నట్లు అయింది. ఈ కార్యక్రమంలో కుమ్ములు ఛానల్ చైర్మన్ నర్సి నాయుడు, మాజీ జెడ్పిటిసి ఆకిరి ప్రసాదరావు, పూసపాటి పాలెం సర్పంచ్ రౌతు స్వామి నాయుడు, కొప్పెర్ల ఉపసర్పంచ్ లంకలపల్లి రాజారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఓన్ సోర్స్ రెవిన్యూతో గ్రామాలు మరింత అభివృద్ధి : ఎంపీడీవో ఎస్.రామకృష్ణ



**బాడంగి, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** గ్రామపంచాయతీల ఆర్థిక స్వయం సమృద్ధికి ఓన్ సోర్స్ రెవెన్యూ కీలకమని ఎంపీడీవో ఎస్. రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు, పంచాయతీ సాంకేతిక సహాయకులకు ఓన్ సోర్స్ రెవెన్యూపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రేడ్ లైసెన్స్ మంజూరు విధానం, అమలు పద్ధతులు, స్వర్ణ పంచాయతీ లక్ష్యాలు, డిజిటలైజేషన్ ప్రక్రియ, ఇంటి పన్ను లెక్కింపు విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి పరిశుభ్రమైన త్రాగునీరు అందించే చర్యలు, గ్రామాల సమగ్ర అభివృద్ధికి రూపొందించాల్సిన ప్రణాళికలపై ఆయన వివరించారు. భవిష్యత్‌లో గ్రామపంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు స్థానిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేలా అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో సూచించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన



**చీపురుపల్లి, ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం అంతా సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ నెల 28న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కోసం సీఎం విజయనగరం జిల్లాకు రానున్న నేపథ్యంలో చీపురుపల్లి మండలం రావివలస సమీపంలోని పైలపేట వద్ద ఏర్పాటు చేయనున్న సభా ప్రాంతాన్ని, హెలిప్యాడ్ స్థలాన్ని పార్టీ నాయకులతో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఎక్కడా, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయనతో పాటు జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున రావు, టి.వెంకటేశ్వరరావు, డీడీఓ కొత్తకోట హేమసుందరరావు, ఎంపీడీఓ సురేష్ కుమార్, సర్పంచ్ పనస మణికంఠ, పైల త్రినాధ్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్.కోట నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధిపై

## మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కోళ్ల



**లక్క వరపు కోట ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని పలు ప్రధాన రహదారుల అభివృద్ధి, మరమ్మతులపై చర్చించిన ఆమె, రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి మంత్రికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచాల్సిన ఆవశ్యకతను ఎమ్మెల్యే వివరించగా, దీనిపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు అని ఎమ్మెల్యే తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి కర్రోతు విరాళం

### శివాలయానికి రూ.50 వేలు వితరణ



**భోగాపురం, ఫిబ్రవరి 24, (మేజర్ న్యూస్) :** భోగాపురం మండలం గుడివాడ గ్రామంలోని నూతన శివాలయం నిర్మాణానికి రూ.50 వేలు ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు విరాళం అందజేశారు. పోలిపల్లి స్వగృహం వద్ద ఆలయ కమిటీ సభ్యులకు ఈ నగదును అందజేసి తన భక్తి భావాన్ని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సర్పంచ్ ప్రతినిధి చిల్ల సురేష్ రెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షులు పరశురామ్, టీడీపీ నాయకులు రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

# పొందూరు ఖాదీకి పట్టాభిషేకం



- మంగళగిరి పట్టుతో ఆత్మీయ సత్కారం:
- మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే గొండు శంకర్.

**శ్రీకాకుళం ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్** :రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు యువజన సేవల శాఖ మంత్రి నారా లోకేష్ ను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తో పాటు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మరియు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి సమీపంలోని ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశం అత్యంత ఆత్మీయ వాతావరణంలో సాగింది. రాజకీయ కార్యక్రమాల ఒత్తిడికి దూరంగా, కుటుంబ సభ్యుల సమ్మేళనంలా జరిగిన ఈ భేటీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సాంప్రదాయాలు, సంస్కృతి, ఆప్యాయతలకు ప్రతిబింబంగా నిలిచింది.సమావేశం సందర్భంగా ఉత్తరాంధ్రకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన పొందూరు ఖాదీ వస్త్రాలను ఎమ్మెల్యే గొండు శంకర్ మంత్రి లోకేష్‌కు గౌరవంగా బహుకరించారు. చేనేత రంగం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం కోసం మంత్రి లోకేష్ తీసుకుంటున్న చర్యలకు గుర్తింపుగా ఈ సత్కారం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పొందూరు ఖాదీ దేశవ్యాప్తంగా ప్రత్యేక స్థానం కలిగి ఉండటంతో, ఈ బహుమతి ఉత్తరాంధ్ర ప్రజల ప్రేమాభిమానాలకు ప్రతీకగా నిలిచింది.దీనికి ప్రతిగా మంత్రి లోకేష్ తన ఆత్మీయతను చాటుతూ ఎమ్మెల్యే గొండు శంకర్ కుటుంబ సభ్యులకు మంగళగిరికు ప్రసిద్ధి చెందిన పట్టుచీరలను కానుకగా అందించారు. మంగళగిరి చేనేత సంప్రదాయం రాష్ట్ర గర్వకారణమని, చేనేత కళాకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఈ పరస్పర సత్కారం ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల చేనేత వారసత్వాన్ని ప్రతిబింబించిందని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ సమావేశం కేవలం ఆత్మీయ కలయిక మాత్రమే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కీలక వేదికగా కూడా నిలిచింది. గతంలో శ్రీకాకుళం నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే గొండు శంకర్ సమర్పించిన వినతిపత్రాల పురోగతిని మంత్రి లోకేష్ సమగ్రంగా వివరించారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖల ద్వారా తీసుకున్న చర్యలు, అమలు దశలో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను వెల్లడిస్తూ యాక్షన్ టేకన్ రిపోర్ట్‌ను సమర్పించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో మంత్రి లోకేష్ చూపుతున్న చొరవ, కార్యదీక్ష ప్రశంసనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందనే నమ్మకం ఈ సమావేశం ద్వారా మరింత బలపడిందన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం మధ్య సమన్వయం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి లోకేష్ అందించిన ఆత్మీయ ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే గొండు శంకర్, ఆయన స్ఫూర్తితో ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి భవిష్యత్తులో మరింత అంకితభావంతో పని చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశం ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు మరియు రాష్ట్ర ప్రభుత్వ మధ్య సాన్నిహిత్యం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలకంగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు.

## అంబటి రాంబాబుకు ధర్మాన కృష్ణదాస్ పరామర్శ



**శ్రీకాకుళం ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్** : ఇటీవల జైలు నుంచి విడుదలైన మాజీ మంత్రి అంబటి రాంబాబును మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మంగళవారం పరామర్శించారు. గుంటూరులోని అంబటి నివాసానికి వెళ్లిన కృష్ణదాస్, ఆయనను ఆత్మీయంగా పలకరించి కుశలప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. జైలులో ఉన్న సమయంలో ఎదురైన పరిస్థితులు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు కాసేపు చర్చించారు.అక్రమ కేసులు ఎదుర్కొంటాం..ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ధైర్యంగా నిలబడి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అంబటి రాంబాబు వంటి సీనియర్ నేతలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, టెక్కలి, ఆమదాలవలస నియోజకవర్గాల వైఎస్ఆర్సిపి సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవి, రణస్థలం మండల పార్టీ అధ్యక్షులు గొర్లె శ్రీనివాస్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్: భాను



**సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్**: భాను రణస్థలం మండలం రణస్థలం పంచాయతీ పరిధిలోగల రణస్థలం కాలనీ వీధిలో విజయనగరం పార్లమెంట్ మెంబర్ కలిశెట్టి అప్పలనాయుడు మరియు ఎచ్చెర్ల శాసన సభ్యులు ఎన్ ఈశ్వరరావు ఆశీసులతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు మరియు రణస్థలం పంచాయతీ సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు మంగళవారం సీసీ రోడ్ శంకుస్థాపన చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి హయాంలో పంచాయతీలో ఉన్న గ్రామాలకు ప్రతి వీధికి సీసీ రోడ్లు వేయటం వలన ప్రజలు సంతోషిస్తున్నారని అన్నారు. ఇంతవరకు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేని పంచాయతీలు ఈరోజు అన్ని విధాల అభివృద్ధి పదంలో ఉన్నాయని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నడూ మర్చిపోలేని విధంగా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ ప్రతినిధి మజ్జి వెంకటరమణ, మహదాసు శ్రీను, మహదాసు గోవింద్, సూరిపంతు సాయి,కేలం వెంకటరమణ,గుడిపాడు ప్రదీప్ కుమార్, దామోదర్ సాయి, కుప్పిలి అప్పారావు, నాచ్చన్న, అప్పలనాయుడు, నారాయడు, సూరి, గొల్ల,గొర్లె గోవింద్, కలిసెట్టి భద్రయ్య ,కోటి, సత్యరావు, జోగినాయుడు, పండు, గొర్లె అసిరప్ప,రామునాయుడు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ వైఫల్యమే డయేరియాకు కారణం




**శ్రీకాకుళం/ నరసన్నపేట ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్** : జిల్లా కేంద్రంలో డయేరియా ప్రబలి పదుల సంఖ్యలో ప్రజలు ఆస్పత్రుల పాలు కావడానికి కూటమి ప్రభుత్వ అసమర్థతే కారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. రహదారి మరమ్మతు పనుల వల్ల తాగునీరు కలుషితం అవుతుందని తెలిసినా, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. అధికారులు, పాలకులు క్షేత్రస్థాయి పరిస్థితులను గాలికొదిలేయడం వల్లే నేడు 32 మంది అమాయక ప్రజలు మంచాన పడ్డారని ఆయన ఆరోపించారు.జిల్లాలో ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని, బాధితులకు అందుతున్న వైద్యంపై తమకు నమ్మకం లేదని కృష్ణదాస్ విమర్శించారు. తక్షణమే బాధితులందరికీ మెరుగైన ఉచిత వైద్యం అందించడంతో పాటు, కలుషిత నీరు సరఫరా కావడానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఈ ప్రభుత్వం, తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించాలని, లేనిపక్షంలో వైకాపా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## సీజ్ చేసిన మద్యంను డిస్పోజ్ చేసిన పోలీసులు



**ఆమదాలవలస, ఫిబ్రవరి 24, మేజర్** :ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ దాడుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ డిఎస్పి రామచంద్ర కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం డిస్పోస్ చేశారు. 2022-2026 సంవత్సరాల మధ్య పట్టుబడిన 760 మద్యం సీసాలను సీజ్ చేయడంతో వాటిని డిస్పోస్ చేశారు. ఈ మద్యం బాటిల్ల విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస ఎస్సై యస్.బాలరాజు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ప్రవేశ పరీక్షలు మార్చి 8వ తేదికి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్:** పెద్దపాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ప్రవేశ పరీక్ష (దీ=ూ+జజు) మార్చి 2వ తేదిన జరగాల్సిన పరీక్షలు మార్చి 8వ (ఆదివారం)తేదికి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక పత్రికా ప్రకటన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ దేవి విడుదల చేశారు. 5వ తరగతి మరియు జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష షెడ్యూల్ ప్రకారం యథావిధిగా మార్చి 1వ(ఆదివారం) తేదిన జరుగుతుందని తెలిపారు. మంగళవారం నుండి హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకోవలసిందిగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ దేవి తెలిపారు.



# పార్వతీపురం / మన్యం జిల్లా

## ఆర్టీసీ ప్రైవేటీకరణను విడనాడాలి



**పాలకొండ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం కాలుష్య నివారణ పేరుతో 750 విద్యుత్ బస్సుల నిర్వహణను పినాకిల్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించడం, 12 డిపోల మూసివేతకు సిద్ధపడటం దారుణమని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పాలకొండ డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ ఖండించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై డిపో వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఇప్పటికే నాలుగు డిపోలను ఖాళీ చేయాలని ఆదేశాలు ఇవ్వడం సంస్థ మనుగడకు ముప్పు అని, విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రభుత్వం లేదా ఆర్టీసీ సంస్థే నేరుగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కార్యదర్శి డీజి రావు, ఉపాధ్యక్షుడు పి ఎల్ రావు, చైర్మన్ యు సుబ్బారావు, సి.ఎస్.సంగమేష్, యు.లక్ష్మి, బివి రమణ, ఎమ్మార్ మూర్తి, ఎంఆర్ బాబు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**పాలకొండ, మేజర్ న్యూస్ :** అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళ వారం పాలకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రెండో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షు రాలు ఎన్.హిమప్రభ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.అమరవేణి మాట్లాడారు. గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, అంగన్వాడీలపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని మరియు సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే విజయవాడ మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి శారద, ఎం.శ్యామల, శ్రీదేవి, వైమణి, లలిత, జి.భాయ్, దివ్య, సునీత పాల్గొన్నారు.

## ఐదో వారం.. అదే జనం

– పోలమాంబను దర్శించుకున్న వేలాది భక్తులు – వనం గుడి వేప చెట్టుకు ప్రత్యేక పూజలు

– సిరిమాను కర్రకు పూజల నిర్వహించిన మహిళలు – భక్తులతో కిక్కిరిసిన క్యూ లైన్లు









**మక్కువ, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతగాంచిన శంబర పోల మాంబ అమ్మవారి జాతరలో భాగంగా ఐదవ వారం కూడా భక్తులతో శంబర గ్రామం కిక్కిరిసింది. అమ్మవారిని దర్శించుకునేం దుకు ఊహించని జనం రావడంతో వనం గుడి తో పాటు చదురు గుడుల క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. వనం గుడి వద్ద గల అమ్మవారి ప్రతి రూపంగా వెలసిన వేప చెట్టుకు అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు.

సిరిమాను కర్రకు మహిళలు పసుపు కుంకుమల సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు పవిత్ర గోముఖీ నదిలో స్నానమాచరించి శ్రీ పోలమాంబ అమ్మవారికి ముడుపులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. చదురు గుడి నుండి వనం గుడి రహదారి అంత భక్తులతో కిక్కిరిసింది. రెండు గుడుల పరిసరాలు భక్తులతో కోలాహాలంగా మారాయి. అమ్మవారిని దర్శించుకోవ డానికి వచ్చిన బంధుమిత్రులు కుటుంబ సభ్యులు సమీప పొలాల్లో గల చెట్ల కింద వంట చేసుకొని విందు ఆరగించారు. అల్పపీడన ప్రభావంతో వాతావరణం చల్లగా ఉండటంతో అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు ఎంతో ఆహ్లాద కరంగా కనిపించారు. అమ్మవారిని దర్శించుకు నేందుకు వచ్చిన భక్తులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి బి శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆరవ వారం సందర్భంగా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, మక్కువ ఎస్ఐ, ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు.

## ట్రాక్టర్ బోల్తా... డ్రైవర్‌కు గాయాలు



**మక్కువ, ఫిబ్రవరి 24, (మేజర్ న్యూస్) :** కర్రలు లోడ్ తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మండలం లో ఏ.వెంకంపేట గ్రామ సమీ పంలో గల కాజువే వద్ద సోమ వారం అర్ధరాత్రి కర్రల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడిన అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ను నడుపుతున్న డ్రైవర్ బి కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. తెర్లాం మండలం, రంగపువలస గ్రామానికి చెందిన బి.కృష్ణ మక్కువ మండలం నుండి, బొబ్బిలి వైపు కర్రలు లోడ్ టాక్టర్ నడుపుతుండగా ఏ వెంకంపేట గ్రామం కాజువే వద్ద టాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. అదే సమయంలో మక్కువకు చెందిన పలువురు యువకులు బొబ్బిలి నుండి మక్కువ వస్తుండగా కాజువే వద్ద టాక్టర్ పడి ఉండగా, డ్రైవర్ కృష్ణ గాయాలపాలై అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించి 108కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి 108 సిబ్బంది చేరుకొని, బొబ్బిలి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుండి విజయనగరం ఓ ప్రవేటు ఆసుపత్రికి డ్రైవర్ కృష్ణను తరలించారు.

## అన్యోన్యత, ఆప్యాయత పోటీతత్వాన్ని పెంచుతాయి

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడా పోటీల్లో రన్నింగ్‌లో విన్నర్‌గా నిలిచిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర





**పార్వతీపురం, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** అమరావతిలో జరుగుతున్న ఎమ్మెల్యే ఎమ్మెల్సీ క్రీడా పోటీలలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సత్తా చాటుతున్నారు. ఉత్సాహంగా సాగుతున్న పోటీలలో రన్నింగ్ లో విన్నర్ గా నిలిచారు. అలాగే తగ్గఫ్ వార్ పోటీలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు టీంలో పాల్గొని విజయం సాధించారు. వాలీబాల్, కబడ్డీ పోటీలలో ఎమ్మెల్యే విజయ్ చంద్ర సత్తా చాటారు. అమరావతిలో జరుగుతున్న ఎమ్మెల్యే ఎమ్మెల్సీ క్రీడా పోటీలు ఉత్సాహంగాను సందడిగాను సాగుతున్నాయని సభ్యుల మధ్య అన్యోన్యత ఆప్యాయత పోటీ తత్వాన్ని పెంచుతున్నాయని ఎమ్మెల్యే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అలాగే ఆటలు మానసిక, ఆరోగ్య వికాసానికి తోడ్పడతాయని తెలిపారు.

## ఘనంగా జరిగిన సిర్లి ఎల్లమ్మ తల్లి జాతర



**సీతానగరం ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** మండల కేంద్రంలో దేవరవీధిలోని ఎల్లారమ్మతల్లి ఆలయంలో సిర్లి జాతర ఘనంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులుతో పాటుయువకులు,మహిళలు తరలివచ్చి దర్శించుకున్నారు. సిర్లిజాతరకుగుడ్లు, పళ్ళు ఉలవలు, బియ్యంతో భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు.సిర్లిఎల్లమ్మతల్లిని పూజిస్తే చర్మ వ్యాధులు రావని భక్తులుతెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు జాతర జరిగింది. పెద్ద ఎత్తున షాపులు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటి చైర్మన్ చెలికాని గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ హేమలత ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

## డీవార్మింగ్ మాప్-అప్ డే పర్యవేక్షించిన డిఎంహెచ్ఓ



**సీతానగరం, ఫిబ్రవరి24 మేజర్ న్యూస్ :** డీవార్మింగ్ మాప్అప్ డే కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు జోగింపేట, కెజిబివి పాఠశాలలో మంగళవారం ఆర్.బి.ఎస్.కె అధికారి డా టి. జగన్ మోహనరావు తో కలిసి పర్యవేక్షణ చేశారు.జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమశీ రోజున ఏవైనా కారణాలచే ఆల్బెండజోల్ మాత్రలు వేయబడని విద్యార్థులు ఎంత మంది ఉన్నారు, అందుకు గల కారణాలు తెలుసుకున్నారు. ఆ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. అనంతరం కార్యక్రమ ఆవశ్యకతపై, ఆరోగ్య అంశాలపై డిఎంహెచ్ఓ సూచనలు చేశారు. నులిపురుగుల సంక్రమణ వల్ల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి మందగించడం,కడుపు నొప్పి బరువు తగ్గడం మొదలగు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని అందుకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించి డీవార్మింగ్ చేయడం తప్పనిసరి అన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికపుడు పర్యవేక్షణ చేయాలని వైద్య సిబందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్.బి.ఎస్.కె అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, ప్రోగ్రాం అధికారి డా. సూర్యకౌశిక్, వైద్యాధికారి డా. ఉషారాణి, ఎస్.ఓ జె. సంధ్య, సూపర్వైజర్ భవాని,వైద్య సిబ్బంది లోకేశ్వరి,ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# కొట్యాడ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థినికి అరుదైన గౌరవం




**లక్కవరపుకోట, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** మండలం లోని కొట్యాడ ఉన్నత పాఠశాలలో 2024-25లో పదవ తరగతి చదివి అప్పుడు జరిగిన పబ్లిక్ పరీక్షలలో 600 మార్కులకు గాను 592 తెచ్చుకుని జిల్లా సెకండ్ ర్యాంకర్‌గా నిలిచి పాఠశాలకి ఎల్.కోట మండలానికి మంచి పేరు తెచ్చికున్న పి.భాగ్య శ్రీ పేరును ఆమె చదివిన పాఠశాలలోని ఏ సెక్షన్ తరగతి గదికి భాగ్య శ్రీ పేరు పెట్టడం జరిగింది. ఇలా ఒక తరగతి గదికి పూర్వ విద్యార్థిని పేరు పెట్టడం ద్వారా ఆ విద్యార్థిని అరుదైన గౌరవం లభించి నట్లే అని ఎచ్ ఏం జామి అప్పలనాయుడు తెలిపారు ఇలా మంచి మార్కులు తెచ్చుకునే విద్యార్థులకు వచ్చిన గౌరవం తమకు కూడా రావాలి అని భవిష్యత్తులో మిగిలిన విద్యార్థులు కూడా అనుకుని బాగా చదవాలని ఈవిదంగా తరగతి గదికి భాగ్యశ్రీ పేరు పెట్టడం జరిగిందని తెలిపారు.

# బాడంగి గ్రంథాలయాన్ని సందర్శించిన డెల్ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్



**బాడంగి, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ సహకారంతో డెల్ టెక్నాలజీస్ శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ ఇన్‌క్లూజన్ సెంటర్‌ను రాష్ట్ర డీఐసీ ప్రాజెక్ట్ మేనేజర్ వి. స్వాతి దేవ్ మరియు అధికార బృందం మంగళవారం బాడంగి గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో అందిస్తున్న డిజిటల్ అక్షరాస్యత, కంప్యూటర్ శిక్షణ, ఇ-సేవలు, స్పోకెన్ ఇంగ్లీష్, కెరీర్ గైడెన్స్ వంటి సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠకులకు ఉపయోగపడేలా త్వరలో మరో కంప్యూటర్‌తో పాటు అదనపు సాంకేతిక సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గ్రంథాలయాధికారి ఆర్.దుర్గా ప్రసాద్, గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు వై.రవి బాబు ఈ కార్యక్రమంలో లీడర్స్ క్లబ్ సభ్యులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓన్ సోర్స్ రెవిన్యూతో గ్రామాలు మరింత అభివృద్ధి : ఎంపీడీవో



**లక్క వరపు కోట ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** గ్రామపంచాయతీల ఆర్థిక స్వయం సమృద్ధికి ఓన్ సోర్స్ రెవెన్యూ కీలకమని ఎంపీడీవో అల్లు భాస్కర రావు పేర్కొన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు, పంచాయతీ సాంకేతిక సహాయకులకు ఓన్ సోర్స్ రెవెన్యూ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమంఎంపీడీఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రేడ్ లైసెన్స్ మంజూరు విధానం, అమలు పద్ధతులు, స్వర్ణ పంచాయతీ లక్ష్యాలు, డిజిటలైజేషన్ ప్రక్రియ, ఇంటి పన్ను లెక్కింపు వేలం పాట విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి పరిశుభ్రమైన త్రాగునీరు అందించే చర్యలు, గ్రామాల సమగ్ర అభివృద్ధికి రూపొందించాల్సిన ప్రణాళికలపై ఆయన వివరించారు. భవిష్యత్‌లో గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు స్థానిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేలా అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీఓ మహా లక్ష్మి నాయుడు తదితరులు పాల్గొని ప్రభుత్వ గ్రాంట్స్ గ్రామ పంచాయతీ సర్వే తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

# ఘనంగా బాడంగి పోలమాంబ అమ్మవారి మహోత్సవాలు



**బాడంగి, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** బాడంగి మండల ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల కొంగుబంగారం అయిన శ్రీశ్రీశ్రీ పోలమాంబ గ్రామదేవత అమ్మవారి వార్షిక మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. మహోత్సవాల సందర్భంగా గ్రామమంతా భక్తిశ్రద్ధలతో కళకళలాడగా, ప్రతి ఇంటిలో పండుగ వాతావరణం నెలకొంది. మహోత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల కార్యక్రమం నిర్వహించగా, మంగళవారం ఉయ్యాల కంబాల మహోత్సవం, ఉజ్జీలు, బళ్ళు కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి పరదేశమ్మ అమ్మవారి ఘటాలను, రాత్రికి పోలమాంబ అమ్మవారి ఘటాలను తిరువీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఇటువంటి సంప్రదాయ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి భక్తి కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ మహోత్సవాలను దర్శించేందుకు బాడంగి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు మహోత్సవాలను శాంతియుతంగా, సంప్రదాయ బద్ధంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ దేవరపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కండి రమేష్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. గ్రామ ప్రజల సహకారంతో పోలమాంబ అమ్మవారి మహోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని గ్రామ పెద్దలు తెలిపారు.

# మనీష్‌కి పలువురు అభినందనలు



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** ఏపీపీఎస్సీ గ్రూపు 2 ఫలితాలలో సత్తాచాటి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీషర్ ఉద్యోగం సాధించిన పతివాడ మనీష్‌ని మంగళవారం పలువురు అభినందించారు. మండలంలోని కొండగుంపాం గ్రామం గ్రామస్తులు అభినందించారు. విజయనగరంలో మనీష్ నాయుడుతో పాటు తల్లిదండ్రులు పతివాడ గోవిందరావు, అన్నపూర్ణకి దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. మనీష్ నాయుడు ఉన్నతి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. మనీష్ ని అభినందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాధ్, లెప్రా సొసైటీ ఫండ్ రైజింగ్ ఆఫీషర్ లెంక రమణ, ఐఆర్ టి బెల్లాన అప్పలనాయుడు, మీసాల అప్పలనాయుడు, పతివాడ బుజ్జి, లెంక లక్ష్మణరావు, రుంకాన గౌరి శంకర్, చెల్లూరు సుధీర్, పతివాడ లోకేష్, నడిపేన లోకేష్ ఉన్నారు.

# ప్రముఖ రంగస్థలం నటుడు అమరపు ఘన సన్మానం

**– ప్రముఖుల సమక్షంలో చీకటి రామారావు పురస్కార గ్రహీత – వందేళ్ళ చరిత్ర కలిగిన పోలిపల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు**



**తెర్లాం ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** ప్రముఖ రంగస్థలం నటుడు అభినవ శ్రీరామ బిరుదాంకుతుడు అమరపు కృష్ణమూర్తి కి నంది అవార్డు గ్రహీత చీకటి రామారావు పురస్కారాన్ని ప్రముఖుల సమక్షంలో అందుకున్నారు. రాజాం శ్రీశ్రీశ్రీ పోలిపల్లి పైడితల్లి శత వార్షిక జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కళావేదికలో ఎస్వీఆర్ నాటక కళాపరిషత్ అధ్యక్షులు సలాది తులసీదాస్ ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి వెంకట నాయుడు ప్రముఖులు సాహితీవేత్తలు రంగస్థలం కళాకారులు కళాభిమానుల మధ్య అమరపు కృష్ణమూర్తికి చీకటి రామారావు పురస్కారంతోపాటు నగదు బహుమతి ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాటక కళా విశారద బళ్ళారి రాఘవ అవార్డు గ్రహీత సువర్ణ కిరీట విజేత అమరపు సత్యనారాయణ పురస్కారాన్ని ప్రముఖ రంగస్థలం నటులు గుండ్రెడ్డి బలరామ స్వామి నాయుడు అత్యున్నతమైన పురస్కారాన్ని అతనికి అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్ వి ఆర్ నాటక కళా పరిషత్ అధ్యక్షులు సలాది తులసి దాస్ మాట్లాడుతూ గత సుమారు పది దశాబ్దాలుగా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలలో ఎస్ వి ఆర్ నాటక కళాపరిషత్తు వివిధ రకాల పౌరాణిక సాంఘిక జానపద చారిత్రకమైన నాటక కళ కారులను ప్రోత్సహిస్తూ వివిధ రకాల అవార్డులతో ఘనంగా సన్మానించి సత్కరించడం ఆనవాయితీగా వస్తున్న ఆచారంగా భావించవచ్చని అన్నారు. కీర్తిశేషులు దివంగత సలాది వెంకటరమణ డాక్టర్ సలాది రామారావుల వారి నేతృత్వంలో ఆవిర్భవించిన ఈ ఎస్వీఆర్ నాటక కళాపరిషత్తు ఇంకా ఇంకా విరాజిల్లాలని ఎంతోమంది ఉత్తమ కళాకారులను ఈ వేదిక పైన వారికి సన్మాన సత్కారాల జరిపించాలని అలాంటి అదృష్టం మాకు కలగాలని ఆ తల్లి దీవెనలు నిండుగా ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ సందర్భంగా చీకటి రామారావు మాస్టర్ పురస్కారాన్ని అమరపు కృష్ణమూర్తికి అత్యున్నతమైన ప్రముఖ రంగస్థలం నటులు కీర్తిశేషులు అమరపు సత్యనారాయణ పురస్కారాన్ని జి బలరామస్వామి నాయుడుకు అందించడం మా చేతుల మీదుగా అందించడం మేము చేసుకొను పూర్వజన్మ సుకృతముగా భావిస్తున్నామన్నారు. అదే విధంగా ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి వెంకట నాయుడు మాట్లాడుతూ వందేలు చరిత్ర కలిగిన పోలిపల్లి జాతర మహోత్సవాలు నిర్విఘ్నంగా కొనసాగించేందుకు కమిటీ వారికి అధికార అ న ధికారులకు ముఖ్యంగా కొండంపేట గ్రామ వాసులకు మా ఎస్వీఆర్ నాటకకళాపరిషత్ తరపున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది రాజాం ఎమ్మెల్యే గౌరవ నీయులు కొండ్రు మురళీమోహన్ రావు ప్రభుత్వం ఆర్థిక సాయంతో అంగరంగ వైభవంగా జరిపించేందుకు చర్యలు తీసుకోవడం మహదానందంగా ఉందని మరొకసారి కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాకు ప్రేక్షకులు కళాభిమానులు ముఖ్యంగా సాహితీవేత్తలు కళాకారులు హాజరై ఆనందాన్ని కలిగించినందుకు హృదయపూర్వక నమస్సుమాంజలు అర్పించుకున్నారు కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కళా కారులు ప్రముఖులు రొంగలి స్వామినాయుడు మాస్టారు చీకటి రామారావు మాస్టరు కుటుంబ సభ్యులు అధికారులు అనధికారులు కళాభిమానులు పాల్గొన్నారు.

# బధిర విద్యార్థులకు అమ్మవారి దర్శనం కల్పించిన పోలీసులు



**చీపురుపల్లి ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్ :** గరివిడి మండలం శ్రీరామ్ నగర్ లో గల ఉమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్లో ఉంటున్న సుమారు 95 మంది బధిర విద్యార్థులకు చీపురుపల్లి డిఎస్పీ ఎస్ రాఘవులు ఆధ్వర్యంలో శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనం మంగళవారం చేయించారు. చీపురుపల్లి సిఐ శంకరరావు, ఎస్ఐ దామోదరరావు, సేవాదళ్ పోలీసుల సహాయంతో బధిర విద్యార్థులను వాహనంలో ఎక్కించి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనం చేయించి వారిని గుడి మొత్తం తిప్పి చూపించి, అమ్మవారి ప్రసాదాలు అందజేసారు. అనంతరం ఆత్మ విశ్వాసంతో ఏ పనినైనా చేపడితే ఎన్ని అవరోధాలనైనా అధిగమించి విజయం సాధించవచ్చునని, ఇతరులకంటే శారీరకంగా లోపాలున్నా విజయం సాధించేందుకు ఇవేవి అవరోధాలు కాదని, బధిర విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చెప్పి తిరిగి సురక్షితంగా వారిని ఉమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ వద్దకు చేరవేశారు. బధిర విద్యార్థులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

**చీపురుపల్లి ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** 28న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రావివలస పంచాయతీలో పైలపేట గ్రామ పర్యటన ఖరారు చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం అధికారిక షెడ్యూల్ విడుదల చేసింది. పర్యటన ఖాయం కావడంతో సీఎంఓ కార్యాలయాధికారి ధనుష్, జిల్లా వెలుగు పీడీ శ్రీనివాస ఫణితో కలిసి ప్రాథమికంగా పైలపేట గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో అధికారులు తెసుకోవాల్సిన పలు చర్యలను సూచించారు. సర్పంచ్ పనన మణికంత, నియోజకవర్గ తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు పైల త్రినాథతో సీఎంఓ కార్యాలయాధికారి ధనుష్ పలు అంశాలపై మాట్లాడారు. సీఎం పైలపేట గ్రామ సందర్శన, ప్రజావేదిక, నియోజకవర్గ కార్యకర్తల సమావేశ సభాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఎక్కడెక్కడ ఉండాలో తదితర అంశాలపై చర్చించారు.



ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో జడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ మల్లిఖార్జునరావు, చీపురుపల్లి ఆర్డీఓ ప్రమీలా గాంధీ, ఇతర అధికారులు అక్కడే ఉండి పనులను పర్యవేక్షించారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లుపై జాయింట్ కలెక్టర్ సమీక్ష



**చీపురుపల్లి ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** మండలంలోని రావివలస పంచాయతీ పరిధిలో 28న పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి మల్లిక్ నాయుడు అధికారులను కోరారు. మంగళవారం రావివలస పంచాయతీ పరిధిలోని సీఎం పర్యటిస్తున్న సభా స్థలాన్ని ఆయన అధికారుల బృందంతో పరిశీలించారు. స్థానిక శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావు ఆదేశాల మేరకు ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డీఎస్పీ ఎస్ రాఘవులు, ఇంచార్జ్ ఆర్డీఓ ఇతర శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సూచనల ప్రకారం ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే ప్రజలకు, కార్యకర్తలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రోటోకాల్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు, నాయకులకు మల్లిక్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి మొగసాల రమేష్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కాము నాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, సర్పంచ్ పనస మణికంఠ, నియోజకవర్గం రైతు సంఘ నాయకులు పైల త్రినాధ్, జనసేన నాయకులు విసినగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధి కోసం రెండు కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి వినతి

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసిన ఎమ్మెల్యే బేబీనాయన

**బొబ్బిలి, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** బొబ్బిలి పట్టణ రోడ్ల అభివృద్ధికి రెండు కోట్లు మంజూరు చేయాలని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్వి ఎస్కెకె రంగారావు (బేబినాయన) రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలో బొబ్బిలి శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె. రంగారావు (బేబీ నాయన) ముఖ్యమంత్రిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా బొబ్బిలి నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా బొబ్బిలి దాడితల్లి అమ్మవారు



ఉత్సవాన్ని పురస్కరించుకుని బొబ్బిలి పట్టణ రోడ్లు అభివృద్ధి కోసం రూ 2 కోట్లు మంజూరు చేయాలని కోరడం జరిగింది.

ఆ నిధులతో పూల్ బాగ్ జంక్షన్ నుంచి దాడితల్లి అమ్మవారు ఆలయం వరకు ఉన్న రోడ్డు అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని తెలియజేశారు. అలాగే వారు తీసిన వైల్డ్ లైఫ్ ఫోటోలతో చేసిన క్యాలెండరును ముఖ్యమంత్రికి అందజేశారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలోనే ఆ నిధులు మంజూరు అయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# ఆపదలో ఆపన్నహస్తం.. అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి ఆర్థికసాయం

**భోగాపురం, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** అనారోగ్యంతో ఉన్నవారికి ఆపన్న హస్తంలా వారి ఔదార్యాన్ని ఎవరైనా అభినందించాల్సిందే. భోగాపురం మండలం రామచంద్రపేట గ్రామానికి చెందిన కోల రాములు అనే వ్యక్తికి గత 2 ఏళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి పక్షవాతం వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల జనసేన పార్టీ నాయకులు వెంటనే స్పందించి ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు నొడగల రాము రూ.10వేలు, కోన వీరబాబు రూ 5వేలు కలిపి రూ. 15వేలు అందజేశారు. ఎమ్మెల్యే లోకం మాధవి, మండల పార్టీ అధ్యక్షులు వందనాల రమణ, మట్ట అయ్యప్ప రామకృష్ణ రెడ్డి ఆదేశాలు మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆ వ్యక్తికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నీలాతి



బాలకృష్ణ, కోల గోవింద్, కామరాజు, బేపల వెంకటేష్, కోల రమణ జనసైనికులు తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి లక్ష్మి వేణుగోపాల్ నాయుడు

**బొబ్బిలి ఫిబ్రవరి 24: మేజర్ న్యూస్ :** బొబ్బిలి మండలం పక్కి గ్రామంలో మంగళవారం శ్రీశ్రీశ్రీ జగద్గురు శ్రీ మద్విరాట్ పోతూలూరి వీర బ్రహ్మేంద్ర స్వామి టాప్ఆలయ ప్రతిష్ట ఉత్సవాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎంపిపి శంబంగి లక్ష్మీ వేణుగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

# ఘనంగా చినమ్మతల్లి పండుగ





**రామభద్రపురం, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** మండల కేంద్రంలో చినమ్మత ల్లిపండుగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు చినమ్మతల్లి ఘటాలను పసుపుకుంకుమలతో పూజిం చారు. ప్రతీ ఏడాది జరుగుతున్న ఈ పండగలో చుట్టుపక్కల ప్రాంతాలతో సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తెల్లవారుజాము నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా చినమ్మతల్లిని ఈ ప్రాంత ప్రజలు పూజిస్తున్నారు. ప్రతీ మంగళవారం కూడా చినమ్మతల్లిని పూజించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. పూడి శ్రీకాంత్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా ప్రసాదాలు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

## కార్పోరేటర్లకే తాము వ్యతిరేకం, పరిశ్రమలకు కాదు

### – సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాల నాగేశ్వరరావు

**రామభద్రపురం, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** కేంధ్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాల నాగేశ్వర రావు ఆరోపించారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో మంగళవారం ఆయన విలేఖర్ల



తో మాట్లాడారు. పెట్టుబడిదారులతో కుమ్మక్కై పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందని తెలిపారు. లేబర్ కోడ్లు అమలు చేసి కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. అలాగే ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిం చారు. ఎంతోమంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పథకాన్ని దేశంలోనే పూర్తిగా రద్దుచేయాలన్నదే ఎన్డీయే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ను ఎట్టి పరిస్థితిలో ప్రైవేటీకరణ చేయబోమని, అటువంటి సంస్థను ధారాదత్తం చేయడానికి మోడీ ప్రభుత్వం కుయక్తులు పన్నుతోందన్నారు. ఇప్పటికే ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి ఎం తోమంది ప్రజల హక్కులను కాలరాసిందని అన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ముఖ్యంగా రైతులకు, పేదలకు మేలు చేసే పథకాలు రూపొందించాలని సూచించారు. సూపర్ సిక్స్లో ఇంకా హామీలు మిగిలిపోయాయని, వాటిని తక్షణమే అమలు చేయాలని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు అం డగా వామపక్ష పార్టీలు మాత్రమే పోరాటాలు చేస్తాయని తెలిపారు.

## గొలుగు వలసలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

### – ఈదురు గాలులకు 8 స్తంభాలు నేల పాలు



**తెర్లాం ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** గొలుగువలసలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు 8 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దాంతో ఆ గ్రామంతో పాటు వివిధ గ్రామాల్లో విద్యుత్ అంత్రాయం ఏర్పడింది. అందుకు వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు వెను వెంటనే స్పందించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు పునరుద్ధరించడం సంతోషదాయకం. ఈ విషయంలో ఏ.డి.ఇ. తెర్లాం ఎఇ తెంటు శ్రీనివాస రావులకు సిబ్బందికి ఆ గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాల వినియోగ దారులు అభినందనలు అందజేశారు.

## గ్రామ పంచాయతీల ఆదాయ వనరులు పెంపొందించుకోవాలి

**మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.పైడితల్లి వెల్లడి**



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీలను ఆదాయ వనరులుగా తీర్చిదిద్దా ల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళ వారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల పరిధిలో ఆదాయం సమకూర్చు కోవడంపై శిక్షణా కార్యక్రమమును నిర్వహించారు. ఈసందర్భంగా మండల పరిషత్తు అభివృద్ధి అధికారి జి పైడితల్లి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలన్నారు.గ్రామ పంచాయతీల పరిధిలోని చెత్త నుండి సంపద కేంద్రాల ద్వారా ఆదాయమును సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. ఈశిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎల్ గోపాలరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు బంటు అప్పారావు, రంభ శశిభూషణ రావు,సూరు శ్రీనివాస రావు, తిరుపతి భాస్కరరావు, నీరస రవికుమార్, బొంతల వైకుంఠరావు, ఆర్ రాంజీ, పి.రాజేష్ కుమార్, అడ్డూరి లలితకుమారి, దువ్వా సంధ్య, పువ్వల శిరీష, పి.వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

**స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన రంగునాయుడు**



**మక్కువ, ఫిబ్రవరి 24, (మేజర్ న్యూస్) :** మండల కేంద్ర మైన మక్కువ బీసీ కాలనీ సమీపంలో గల అభయాం జనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ కార్య క్రమాన్ని మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్ర మంలో భక్తులు శ్రీ అభయాంజ నేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మాన్ని పురస్కరించుకొని కమిటీ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు మావుడి రంగు నాయుడు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## భోగాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నూతన కార్యవర్గం ఎంపిక

**– అధ్యక్షులుగా లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ**





**భోగాపురం, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** భోగాపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నూతన కార్యవర్గ ఎంపిక మంగళవారం జరిగింది. గత ఆరు నెలల నుంచి నూతన కార్యవర్గాన్ని మార్పు చేయాలనే ఉద్దేశంతో ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ ఎట్టకేలకు సమయం సుగమం అయింది. ఈ క్రమంలో భాగంగానే మంగళవారం చేపట్టిన నూతన కార్యవర్గంలో సుంకరి.లక్ష్మి ప్రాజెక్ట్ అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఈమె అల్లాడిపాలెం అంగన్వాడి కార్యకర్తగా పనిచేస్తున్నారు. ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శిగా గుడ్ల ప్రవీణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని ప్రాజెక్ట్ సిబ్బంది అభినందించారు. సమయస్ఫూర్తితో తమ కర్తవ్యాన్ని నిర్వహించేందుకు సాయ శక్తుల ప్రయత్నిస్తామని ప్రవీణ తెలిపారు.

# ఎస్ఎస్బి ట్రేడ్స్ సహకారంతో జిల్లా స్థాయి ఆర్ట్స్ అండ్ కల్చర్ పోటీలు





**పార్వతీపురం రూరల్ ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్ :** పార్వతీపురంమన్యం జిల్లా, కేంద్రంలో జిల్లాస్థాయి పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష,సహిత విద్య మరియు ఎస్ఎస్బి ట్రేడ్స్ సహకారంతో జిల్లా స్థాయి ఆర్ట్స్ అండ్ కల్చర్ పోటీలు జిల్లా విద్యాశాఖ అధికారి పి బ్రహ్మాజీ రావు చేతులమీదుగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్ర మంలో జిల్లాలో సహితవిద్యా విభాగంలో పనిచేస్తున్న సహిత విద్య కోఆర్డినేటర్ పి భానుమూర్తి, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేటర్లు, 15 మండలాల ఐఆర్పీలు, సుమారుగా 250 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు తో రెండు రోజుల ప్రోగ్రాంలో భాగంగా మొదటి రోజు ఎక్కువ మొత్తంలో, పాటలు డాన్స్ డ్రాయింగ్ గ్రూప్ డాన్స్ ఫ్యాన్సీ డ్రెస్, స్కిట్ మొదలు అయిన ఈవెంట్లలో పోటీలు పూర్తయి గెలుపొందినటు వంటి పాటల పోటీలలో జడ్పీహెచ్ఎస్ కురుపాము కు చెందిన మన్నంగి గణేష్కు మొదటి బహుమతి ఎంపీ ఎల్పీఎస్ శ్రీరామ కాలనీ చెందిన ఎం.జశ్వితకు రెండవ బహుమతి పి నితీష్ కారుణ్యకు మూడవ బహుమతి అలాగే డ్రాయింగ్ జూనియర్స్లో బి తనీష్ కుమార్ కు మొదటి బహుమతి ఏ నేరజాకు రెండో బహుమతి విమోక్షితకు మూడో బహుమతి అలాగే డ్రాయింగ్ సీనియర్ విభాగంలో జి.తేజ కిరణ్ కుమార్ కె లిఖిత్ కుమార్ కు రెండో బహుమతి సంజనకు మూడో బహుమతి మరియు గ్రూప్ డాన్స్ లో జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మొదటి బహుమతి వచ్చాయి.ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సర్టిఫికెట్ మరియు మెమొంటోలు డీఈవో పి. బ్రహ్మాజీ చేతుల మీదుగా అందించడం జరిగినది. చివరిలో లైన్స్ క్లబ్ వారు స్వచ్ఛం దంగా వచ్చి విజేతలకు మెమొంటోలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ రామచంద్ర రావు, లైన్స్ క్లబ్ నిర్వాహకులు సెక్రటరీ బిఎస్ నాయుడు మరియు ట్రెజరర్ శ్రీనివాస్ రావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎస్.సి మాదిగ దళిత కుటుంబాలకు న్యాయం చేయాలి

**– సాగు హక్కు మేరకు పట్టాలు అందజేయాలి – సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సంగం ఆధ్వర్యంలో నిరసన**




**గరుగుబిల్లి, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎస్.సి.మాదిగ దళిత కుటుంబాలకు న్యాయం చేసి వారికి సంబంధించిన భూములపై వారికి సాగు హక్కు పట్టాలు అంద జేయాలని సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సంగం డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాల యం ఎదుట బాధిత దళితులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగం మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామ మాదిగ దళిత సామాజిక వర్గానికి చెందిన బొండ పల్లి ఆనందరావు, అలజంగి యేసోబు, అలజంగి పైడమ్మ, చింతాడ జార్జి, పూతి బుజ్జి, తదితర కుటుంబాలకు చెందిన వారు సుమారు 60 ఏళ్ల నుంచి సర్వే నెం.78/1, సర్వే నెం.82/1, సర్వే నెం.91లో భూములను సాగుచేస్తు న్నారన్నారు.ఈభూముల్లో సాగు చేస్తున్న పంటల వల్ల ఆయా కుటుం బాలు జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే గ్రామానికి చెందిన ఓ పెత్తం దారు ఆభూములను సాగు చేయ నీయ కుండా దళితులను తన మనుషులతో అడ్డుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.గత రెండు నెల లుగా ఆదళిత కుటుంబాలను నానా ఇబ్బందులు పెడుతూ ఆ భూమి పైకి వారిని వెళ్లనీయకుండా అడ్డుకోవడం సరైన పద్ధతి కాదన్నారు.ఏళ్ల తరబడి దళితులు సాగుచేసుకుంటున్న భూములపైన ఆ పెత్తందారు దౌర్జన్యం చేయడం బాధాకరమైన విషయమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సంగం పేర్కొన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం మండల తహసిల్దార్ కు వినతి పత్రమును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎ.ఐ.సి.సి.టి. యు.జిల్లా కమిటీ సభ్యులు అజ్జరాపు దామోదరరావు,గిరిజన నాయకులు మండంగి సుబ్బన్న, పిల్లా రామారావు, దళిత సంఘం నాయకులు అలజంగి యేకోబు, అలజంగి సోమయ్య, కొండపల్లి సంగయ్య, దేవాతి పుష్పారావు, అలజంగి రాజేష్, అలజంగి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# రావుపల్లిలో సిమెంటు రహదారి పనులు ప్రారంభం





**గరుగుబిల్లి, ఫిబ్రవరి 23 ,మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీ అభివృద్ధి లో భాగముగా గ్రామంలో అవసర మైన చోట సిమెంటు రహదారులతో పాటు పక్కా కాలువలను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణం చేపట్టడం జరుగుతోందని మండల పరిధిలోని రావుపల్లి గ్రామ పంచా యతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వ రరావు (మహేష్) పేర్కొన్నారు. మండల పరిధి లోని రావుపల్లి గ్రామ పంచాయతీకి కురుపాం నియోజక వర్గం శాసన సభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి సిమెంటు రహదారులు మరియు పక్కా కాలువల నిర్మాణంకు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో మంగళవారం గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు మహేష్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేష్ మాట్లాడుతూ గ్రామంలోని ఆయా వీధులలో సిమెంటు రహదారుల నిర్మాణాలకు సంబంధించి మంగళవారం పనులు ప్రారంభించడం జరిగిందని తెలి పారు.గ్రామ పంచాయతీ అభివృద్ధి లో భాగంగా రావుపల్లి గ్రామ పంచా యతీలోని ఆయా వీధులలో సిమెంట్ రహదారులు నిర్మాణం నిమిత్తం కురుపాం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నా రు.ఈమేరకు ప్రస్తుతం గ్రామంలోని గుంట్రెడ్డి అప్పలనాయుడు ఇంటి నుండి గ్రామ పంచాయతీ కార్యాల యం వరకు సిమ్మెంటు రహదారి మరియు పక్కా కాలువలు నిర్మా ణంను 3 లక్షల రూపాయల నిధు లతో చేపట్టడం జరుగుతుందన్నా రు.అదే విధంగా బొంతాడ జంగము నాయుడు ఇంటి నుంచి బోను రామినాయుడు ఇంటి వరకు 3 లక్షల 50 వేల రూపాయలతో సిమ్మెంటు రహదారితో పాటు పక్కా కాలువలను నిర్మాణం చేపట్టనున్నా మని సర్పంచ్ మహేష్ పేర్కొన్నారు. ప్రస్తుతం సిమెంట్ రహదారులు ప్రారంభానికి ముందు గ్రావెల్ రహదారిని నిర్మాణం చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రావెల్ లెవెలింగ్ పనులు అనంతరం సిమెంటు రహదారులు మరియు పక్కాకారుల నిర్మాణం చేపట్టనున్నామన్నారు. సిమెంటు రహదారులతో పాటు పాటు పక్కా కాలువల నిర్మాణం పనులను అధికారులు నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయడం జరుగుతుందని సర్పంచ్ బొంతాడ మహేష్ పేర్కొన్నారు.

## నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ కీలకపాత్ర : విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ




**నెల్లిమర్ల, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** శాస్త్రీయ నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారని విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ అన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ అండ్ మూట్ కోర్ట్ కాంపి టీషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు నేరాల తీరు మారిపోయిందన్నారు. సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేర నిరూపణకు అవసరమైన సాక్ష్యాలను సేకరించడంలోనూ, వాటిని భద్రపరచడంలోనూ ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు అవసరం ఎంతో ఉందన్నారు. రానున్న కాలంలో ఈ కోర్సు నేర్చుకున్న వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ జాతీయ సదస్సును వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కోరారు. డీన్ ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థులకు ఎన్నో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. మరో మూడేళ్లలో దేశవ్యాప్తంగా దాదాపు 50 వేల మంది ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులను కేంద్రం భర్తీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగ జోగయ్య, డాక్టర్ ఆశిష్, డాక్టర్ సౌమ్య పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన అమ్మవారి యాత్ర







**చీపురుపల్లి ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** చీపురుపల్లి గ్రామ ఇలవేల్పు శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి 28వ జాతర మహోత్సవాలు మూడురోజుల పాటు వైభవంగా జరిగాయి. మూడో రోజు అయిన మంగళవారం జరిగిన వేడుకల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మూడోరోజు యాత్రలో భాగంగా అమ్మవారికి అక్కచెల్లెలు అయిన కోటదుర్గ, బాగిరేతమ్మ, అసిరితల్లి అమ్మవార్లకు భక్తులు పసుపు కుంకుమలు చెల్లించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి పోషకులు అయిన అడ్డూరి వంశీయుల ఆధ్వర్యంలో అడ్డూరి వీధి నుంచి పట్టణంలోని అన్ని వీధుల్లో ఘటాలను ఊరేగింపు మంగళవాయిద్యాల నడుమ సాగింది.

**దర్శించుకున్న ముఖ్యులు :** టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆమెతో పాటు వైసీపీ జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంత్, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జడ్పిటిసి వలిరెడ్డి శిరీష, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు, బెల్లాన వంశీ కృష్ణ, బమ్మిడి కార్తీక్, అత్తమూరు సర్పంచ్ కుమార్, గవిడి సురేష్, కర్రోతు రమణ ఉన్నారు.

## డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

**- ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.మాణిక్యం వెల్లడి - మార్చి 2న నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్ష 8వ తేదీకి మార్పు**

**- మార్చి1న యధావిధిగా 5 మరియు ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష - విద్యార్థులు ఈవిషయంను గమనించాలి..కోఆర్డినేటర్ మాణిక్యం**






**గరుగుబిల్లి, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల మరియు కళాశాలలో 6,7,8,9,10 వ తరగతులలో ప్రవేశాలకు సంబం ధించి మార్చి 2వ తేదీన నిర్వహిం చాల్సిన ప్రవేశ పరీక్ష మార్చి 8వ తేదీన నిర్వహించడం జరుగుతుం దని ఉమ్మడి విజయనగరం పార్వతి పురం మన్యం జిల్లాల కో ఆర్డినేటర్ ఎం మాణిక్యం తెలిపారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురు కుల పాఠశాల మరియు కళాశాలలో ఆరవ తరగతి నుంచి పదవ తరగ తిలో చేరేందుకు మార్చి రెండవ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించవలసి ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్చి 8న నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థు లకు సమ్మీట్ అసెస్మెంట్ -2 పరీక్షల కారణంగా మార్చి 8వ తేదీ నాటికి వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఐదవ తరగతి మరియు జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఎటువంటి మార్పు లేదని యధావిధిగా మార్చి 1వ తేదీన నిర్వ హించడం జరుగు తుందని జిల్లా కోఆర్డినేటర్ మాణిక్యం వెల్లడించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురు కుల పాఠశాల మరియు కళాశాలలో ఆరవతరగతి నుంచి పదవ తరగతి వరకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష 8వ తేదీకి మార్పు చేసిన విషయ ము దరఖాస్తు చేసుకున్న విద్యా ర్థులు గమనించాలని కోరారు.అదే విధంగా దరఖాస్తు చేసుకున్న విద్యా ర్థులకు ఇంకా ఏమైనా సమాచారం కావాలంటే 9951120330, 7382077621, 9052693269 మొబైల్ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని జిల్లా కోఆర్డినేటర్ ఎం.మాణిక్యం పేర్కొన్నారు.

## అవగాహన, అప్రమత్తతతోనే హెచ్ఐవి నియంత్రణ

### కారుణ్యఫౌండషన్ చైర్మన్ జెసి రాజు



**బొబ్బిలి, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** అవగాహన ,అప్రమత్తత తోనే హెచ్ఐవి వ్యాధిని నియంత్రణ చేయవచ్చని కారుణ్యఫౌండషన్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జె సి రాజు అన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ పథకం డిస్ట్రిక్ట్ మేనేజర్ అప్పల నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్‌జిఓ హోమ్‌నందు హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా పాల్గొన్న కారుణ్య సంస్థ చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ హెచ్ఐవి బారిన పడకుండా జాగర్తలు తీసుకోవటం ముఖ్యమని, ఒకవేళ దాని బారిన పడినా క్రమం తప్పకుండా మందులు వాడటం, పౌష్టికాహారాన్ని తీసుకుంటే జీవిత కాలాన్ని పెంపొందించు కోవచ్చన్నారు. జిల్లా మేనేజర్ అప్పల నాయుడు మాట్లాడుతూ సక్రమంగా మందులు వాడుతున్నవారు ఆరోగ్యంగా చురుకుగా వారిపనుల చేసుకుంటున్నారని, మందులు వాడటంలో అశ్రద్ధ చూపిన వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. హెచ్ఐవి బారిన పడిన భయపడవలసినది లేదన్నారు. హెచ్ఐవి బారిన పడిన వారి పిల్లలు 18 సంవత్సరం లోపు ఉన్నవారు ఉంటే తెలియచేయాలన్నారు. అనంతరం కారుణ్య సంస్థ చైర్మన్ సహకారంతో (రూ 20 వేలు) సమకూర్చిన పౌష్టికాహారాన్నిమరియు దుప్పట్లను బాధితులకు పంపిణీ చేశారు. 5 సంవత్సరాల నుండి హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న జెసి రాజు దంపతులను సమావేశంలో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో యూత్ డెవలప్మెంట్ ఆర్గనైసషన్ పి ఓ శ్రీకాంత్ బాబు ,లాబ్ టెక్నిషిన్ సోమేష్,లింక్ వర్కర్ సూపర్ వైసర్ ప్రసాద్ హేమ, లింక్ వర్కర్స్ నిర్మల,హరి, విజయ,షర్మిల, శ్రీదేవి, సత్యవతి,గోవింద్ మణి తదితరలు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి కోసం కృషి చేస్తా

### ఎంపీడీఓ అల్లు భాస్కరరావు



**లక్క వరపు కోట ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** లక్క వరపు కోట మండల అభివృద్ధికి మండల నాయకులు అధికారుల ప్రజల సహకారంతో తన వంతు కృషి చేస్తాను అని నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన అల్లు భాస్కరరావు తెలిపారు తాను ఈఓపిఆర్డిగా బొబ్బిలి మండలంలో, పలు మార్లు ఇంచార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉందని ఎల్ కోట కి ఎంపీడీఓ ప్రమోషన్ రావడం ద్వారా వచ్చాను అని తాను పూర్తి గా క్షేత్ర స్థాయిలో గ్రామాలలో పర్యటన చేసి సమస్యలు తెలుసుకుని అందరి సహకారంతో వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తాను అన్నారు.

## గరుగుబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులు

**- విద్యుత్ శాఖ ఏఈ బడే శ్రీనివాసనాయుడు వెల్లడి**

**- ప్రస్తుత వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు**



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** మండల కేంద్రం లోని విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మంగళవారంపార్వతీపురం మన్యం జిల్లా విద్యుత్ శాఖ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ కె.గోపాలరావు నాయుడు ఆదేశాలు మేరకు విద్యుత్ శాఖ అధికారులు నిర్వహణ పనులు చేపట్టారు. వేసవి కాలంలో గరుగుబిల్లి విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేందుకు వీలుగా సబ్ స్టేషన్ నిర్వహణ పనులను చేపట్టడం జరిగిందని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బడే శ్రీనువాస నాయుడు వెల్లడించారు. అదేవిధంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనులతో పాటు కార్యాలయ పరిధిలో పరిసరాలను పరిశుభ్రం చేయడం జరిగిందని పేర్కొన్నారు.విద్యుత్తు సబ్ స్టేషన్ నిర్వహణ పనులు కారణంగా గరుగుబిల్లి గ్రామంతో పాటు పెద్దూరు, రావుపల్లి, కొత్తపల్లి, కొత్తూరు, తులసిరామినాయుడువలస, గొట్టివలస, గొల్లవానివలస, ఉద్దవోలు తదితర గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ లో నిర్వహణ పనులు చేపట్టడంతో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు ఉండవని ఏఈ శ్రీనివాస నాయుడు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది డొంకాడ రాజు, ఓలేటి గోపి పాల్గొన్నారు.

## తృప్తి.. పాఠశాల నిర్వహణపై సంతృప్తి

**రామచంద్రపేట మోడల్ ప్రైమరీ పాఠశాలను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు**



**భోగాపురం, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** భోగాపురం మండలంలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీలు మంగళవారం చేపట్టారు. రామచంద్రపేట ప్రైమరీ పాఠ శాలను ముందుగా పరిశీలించి అక్కడ విద్యార్థులతో కాసేపు మాట్లా డారు. విద్యార్థులచే ఎఫ్ఎల్ఎన్ కు సంబంధించి కథల పుస్తకాలను విద్యార్థులచే చదివిం చారు. మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాలను పరిశీలించి నిర్వాహకులకు తగిన సూచనలు అందించారు. టాయిలెట్స్ నిర్వహణ, శానిటేషన్ పరిశీలించి తరగతి గదులలో ముస్తాబు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు ఏలూరు. రాములప్పడు పాఠశాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకంపై పలు సూచనలు ఇస్తూ పాఠశాల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## పట్టాలమ్మ ఆలయంలో సమోహిక కుంకుమ పూజలు



**లక్క వరపు కోట ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** మండలంలోని ఎల్.కోట మేజర్ పంచాయతీ లోని సంగం వీధిలో గల గ్రామ దేవత శ్రీ పట్టాలమ్మ అమ్మవారి దేవా లయంలో వేద పండితులు అక్కా జోస్యుల శ్రీ హరి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి లీలా విశేషాలను శ్రీ హరి శర్మ భక్తులకు వివరించారు.

## మంత్రి నారా లోకేష్‌తో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



**ఆమదాలవలస, ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్:**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతి సమీపంలోని ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఆత్మీయ విందు నిర్వహించడంతో ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సమావేశం కేవలం ఆత్మీయ కలయిక మాత్రమే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కీలక వేదికగా కూడా నిలిచింది. ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై మంత్రితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు నేరుగా అందుతున్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే తగిన నిధులను అందించి అభివృద్ధికి కృషి చేయాలని తెలియజేశారు.

## జాతీయ స్థాయి క్రీడాకారిణికి ఘన సన్మానం



**అరకులోయ,ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్:**అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయస్థాయి క్రీడాకారిణికి మంగళవారం ఘనంగా సన్మానించారు.స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థిని ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ నగరంలో గల బిర్సా ముండా స్టేడియంలో ఫిబ్రవరి 17,18వ తేదీలలో జాతీయ స్థాయి ఖేలో ఇండియా నిర్వహించిన సెలక్షన్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచింది.దీంతో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తామల జ్యోతిక జావెలిన్ త్రో విభాగంలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించింది.ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అభినందన సభ ఏర్పాటుచేసి జాతీయస్థాయి క్రీడాకారిణికి ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలోముఖ్య అతిధులుగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి.చలపతిరావు,స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ శశి కుమార్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ శుభన్ బడ్నాయక్, ఫిజికల్ డైరెక్టర ఎల్.జ్యోతి పాల్గొన్నారు. జాతీయస్థాయి క్రీడాకారిణి సన్మాన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పట్టాసి.చలపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలను విద్యతో సమానంగా భావించి శారీరక,మానసిక వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ,కఠిన శ్రమ, పట్టుదల ఉంటే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో ప్రతిభ చాటగలరని ఆయన పేర్కొన్నారు.ప్రిన్సిపల్ డాక్టర్ భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని నిరంతర సాధనతో ముందుకు సాగాలని, క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు.జ్యోతిక సాధించిన విజయాన్ని ఆదర్శంగా తీసుకుని మరింతమంది విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలని హాయ్ అన్న ఆకాంక్షించారు.ఈ విజయంతో కళాశాలకు మంచి గుర్తింపు లభించిందని కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

## హుకుంపేట మండలంలో తాడిపుట్టు స్వర్ణ గ్రామ సచివాలయం ఘన ప్రారంభం



**హుకుంపేట.ఫిబ్రవరి 24.(సూర్య. మేజర్ న్యూస్):**హుకుంపేట మండలంలోని తాడిపుట్టు గ్రామం మరో అభివృద్ధి మైలురాయిని చేరుకుంది. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం (స్వర్ణ గ్రామం) ను అరకు వైసీపీ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఘనంగా ప్రారంభించారు.గ్రామ ప్రజల హర్షధ్వానాలు, వైసీపీ శ్రేణుల ఉత్సాహ నినాదాల మధ్య ప్రారంభమైన ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది.అభివృద్ధికి నూతన దిశ ఈ సచివాలయం ద్వారా గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి రానున్నాయి. పింఛన్లు, ధృవపత్రాలు, సంక్షేమ పథకాల అమలు వంటి సేవలు ఒకే చోట అందించబడతాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్యలింగం మాట్లాడుతూ ప్రజలే మా బలం... గ్రామాల అభివృద్ధే మా లక్ష్యం. తాడిపుట్టును ఆదర్శ స్వర్ణ గ్రామంగా తీర్చిదిద్దుతాం” అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు హుకుంపేట మండల వైసీపీ అధ్యక్షుడు పాంగి అనిల్,గ్రామ పంచాయతీ సర్పంచ్ సమిడ పూర్ణిమ,కొంతిలి సర్పంచ్ రేగం రమేష్,తాడిపుట్టు సర్పంచ్ సోమెలి.సత్యవతి,ఎంపీటీసీ సింహాచలంలిసుకూరు సర్పంచ్ దనసాని.సత్యవతి,వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో మరియు హుకుంపేట మండల జనసేన అద్యక్షులు బల్జ. కోటేశ్వరరావు, హుకుంపేట వైసీపీ ఉపాధ్యక్షులు కాకరి, వెంకట రావు గ్రామ పంచాయతీ వైసీపీ నేత మాజీ సర్పంచ్, బద్నేని. బొంజుబాబు,హుకుంపేట జనరల్ సెక్రెటరీ వైసిపి జి సాల్మన్ రాజు,ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ఇదే వైసీపీ లక్ష్యమని గ్రామాభివృద్ధి పథంలో మరో ముందడుగు తాడిపుట్టు స్వర్ణ గ్రామంగా మారే దిశగా బలమైన అడుగులు వేయాలని ఎమ్మెల్యే కోరారు.

## ఇద్దరు ప్రత్యేక అవసరాల పిల్లలకు బహుమతులు



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్:** జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో మంగళవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆర్ట్స్ అండ్ కల్చర్ పై పోటీలు నిర్వహించగా ప్రత్యేక అవసరాలు గల ఇద్దరు విద్యార్థులకు జిల్లా స్థాయిలో బహుమతులు లభించాయి. . ఇందులో కోటబొమ్మాలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న కొల్లి రాజేష్ తృతీయ స్థానం సాధించగా, జూనియర్ విభాగంలో తులసి పేట మండల ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న కోటి పల్లవి ప్రథమ స్థానం సాధించింది. వీరికి జిల్లా విద్యాశాఖ అధికారి రవికుమార్, సమగ్ర శిక్ష ఏ.పీ.సి. పి. వేణుగోపాలరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఐ.ఈ. కోఆర్డినేటర్ ఉమాదేవి, ఏ ఎం ఓ సుధాకర్ రావు, ఏ ఎల్ ఎస్ కోఆర్డినేటర్ కింజరాపు రామకృష్ణ, ఐ.ఈ. ఆర్. పి. కె. శరత్ చంద్రిక పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని మంత్రికి వినతి



**మెలియాపుట్టి. ఫిబ్రవరి 24. మేజర్ న్యూస్:**మెలియాపుట్టి మండలం లో పెద్దపద్మాపురం గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కు టిడిపి నాయకులు ఉర్లన వసంత కుమార్ కోరారు. మంగళవారం శ్రీకాకుళంలో ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆయనకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల జీవన్ మిషన్ ద్వారా గ్రామానికి నిధులు గతంలో వెచ్చించినప్పటికీ నేటి వరకు ఇంటింటికి త్రాగునీరు సప్లై కావడం లేదన్నారు.కుళాయిల ద్వారా ఇంటింటికీ త్రాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ఆలయములో వేతన దారులు శ్రమదానం



**మెలియాపుట్టి. ఫిబ్రవరి 24. మేజర్ న్యూస్:**మెలియాపుట్టి శ్రీ రాధా గోవింద స్వామి ఆలయంలో డోలో ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా మంగళవారం ఆలయం ఆవరణలో ఉపాధి వేతన దారులు శ్రమదానం తో ఆలయం పరిశుభ్రం చేశారు. ఆలయంలో ఉన్న పిచ్చి మొక్కలు , చెత్తా చెదారాలను తొలగించి దూర ప్రాంతాలకు తరలించారు. భక్తులకు దైవ దర్శనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేతనదారులు ఆలయం చుట్టూ శుభ్రం చేశారు. దీనితో ఆలయములో ప్రశాంత వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గం సెక్రటరీ అనపాన రాజశేఖరరెడ్డి,ఎరుసు శ్రీనివాసు రెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ చాణుక్య,రేఖాన.వాసు,తాడేలా.భూపతిరావు,దుక్క.శంకర్ రెడ్డి, దల్లి.సుమ,సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## పాతపట్నం జైలును సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



**పాతపట్నం మేజర్ న్యూస్: ఫిబ్రవరి 24:**శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ([illegible]) గౌరవ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి శ్రీ కె. హరిబాబు మంగళవారం పాతపట్నం ఉప జైలును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని ఖైదీల స్థితిగతులను, వారికి అందుతున్న వసతులను స్వయంగా పరిశీలించారు.జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలతో హరిబాబు నేరుగా మాట్లాడారు. వారి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఖైదీలకు సొంతంగా న్యాయవాదిని ([illegible]) నియమించుకునే ఆర్థిక స్తోమత లేకపోతే, అటువంటి వారికి ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. న్యాయ సహాయం కావాల్సిన వారు తమ విన్నపాలను అధికారులకు అందజేయాలని సూచించారు.అనంతరం జైలులోని బ్యారక్‌లను, రికార్డులను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న ఆహారం, తాగునీరు, వాష్ రూమ్‌లు మరియు స్టోర్ రూమ్‌లను పరిశీలించి, పరిశుభ్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖైదీల హక్కులకు భంగం కలగకుండా చూడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జైలు సూపర్డెంట్, జైలు సిబ్బంది మరియు ఇతర న్యాయశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాక్సైట్ నివేదిక పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

**- బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ గిరిజన సలహా మండలి (టీఏసీ)లో తీర్మానం చేయాలి**



**పెదబయలు ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్.** మండలంలోని బాక్సైడ్ తవ్వకాలుజోలికి వస్తే చదివించేది లేదని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. మంగళవారం పెదబయలు జెడ్ పిటిసి సభ్యులు కూడా బొంజు బాబు అధ్యక్షా రౌండ్ టేబుల్ సమావేశం గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించారు. ఈనెల రెండవ తేదీన ఎంపీడీవో ఎమ్మార్వో కార్యాలయాల్లో అఖిలపక్ష నాయకులు వినతి పత్రం సమర్పణకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.సభాధ్యక్షులుగా జంపారంగి సునీల్ వహించారు, ఈ సమావేశంలో వివిధ పార్టీలు ప్రజాసంఘ నాయకులు మాట్లాడుతూ,రౌండ్ టేబుల్ సమావేశం లో పాల్గొన్న ఆదివాసీ, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు చర్చించి ఏకగ్రీవంగా అమోదించారు. బాక్సైట్ తవ్వకాల జోలికి వస్తే సహించేది లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని,ఆదివాసీ లకు నూరు శాతం రిజర్వేషన్ బిల్లు ను అసెంబ్లీ లో ప్రవేశపెట్టాలాని డిమాండ్ చేశారు. ఆదివాసీ ఎమ్మెల్యేలు గిరిజన సలహా మండలి (టీఏసీ)లో బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు.అరకు–చింతపల్లి అటవీ ప్రాంతంలోని 6 బ్లాకులు (చింతపల్లి, సప్పర్ల, అనంతగిరి, గుర్తేడు, గూడెం, కాటంరాజ్ కొండలు)లో సుమారు 615 మిలియన్ టన్నుల బాక్సైట్ నిల్వలు ఉన్నాయని, ఏపీఎండీసీ పేరిట లీజులు మంజూరు చేసి మైనింగ్ పునఃప్రారంభించాలని సిఫారసు చేసినట్లు తెలిపారు. ఏపీఎండీసీ చర్యలపై ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటన చేయాలని పునరుద్ఘాటించారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన కేంద్ర క్రిటికల్ మినరల్స్ పాలసీ (సీఎంసీ)లో బీచ్ సాండ్ మరియు బాక్సైట్ తవ్వకాలను భాగం చేశారని, బీచ్ సాండ్ మైనింగ్ కోసం అధానీ గ్రూప్ యొక్క అల్లూవియల్ హెవీ మినరల్స్ డెవలపర్లకు అప్పగించారని వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో బాక్సైట్ మైనింగ్‌ను కూడా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి మోడీ ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు.బాక్సైట్ తవ్వకాలతో రూ.1.50 లక్షల కోట్ల పెట్టు బడులు 60 వేల ఉద్యోగాలు వస్తాయని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఇది భ్రమలు కల్పించడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని విమర్శించారు. ఇదంతా ఆదివాసీల భూములు, జీవన వ్యవస్థలు దట్టమైన అటవీ ప్రాంతాలను నాశనం చేసే కార్పొరేట్ దోపిడీ ప్రయత్నమని ఆరోపించారు. ఇప్పటికే హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరిట కార్పొరేట్ కంపెనీల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను ఆదివాసీ ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించినట్లు గుర్తుచేశారు.గతంలో 2005–2007లో ప్రభుత్వం జిందాల్ రస్‌అల్‌ఖైమా (ఆన్‌రాక్)తో చేసుకున్న ఒప్పందాలలో తీవ్రమైన లోపాలు బయటపడ్డాయని, సీఏజీ నివేదికలో బాక్సైట్ విలువను తక్కువ చేయడం, ఏపీఎండీసీకి కేవలం 1.5% ఈక్విటీ మాత్రమే ఇవ్వడం ఆదివాసీల హక్కుల ఉల్లంఘనలపై తీవ్రంగా తప్పుపట్టినట్లు తెలిపారు. ఆదివాసీల ఉద్యమాలు పోరాటాల వల్ల 2016లో జీవోలు రద్దు అయ్యాయి, 2019లో ఏపీఎండీసీకు ఇచ్చిన 1,520 హెక్టార్ల లీజులు రద్దు అయ్యాయి. ఇప్పుడు మళ్లీ ఏపీఎండీసీ పేరిట ప్రైవేటు డెవలపర్లతో (బీచ్ సాండ్‌లో వలె 90:10 నిష్పత్తి) మైనింగ్ చేపట్టాలని ప్రయత్నిస్తున్నారని, ఇది ఆదివాసీల భూముల దోపిడీకి మరో మార్గమని ఆరోపించారు. కార్పొరేట్ లాభాల కోసం ఆదివాసీలను బలిదానం చేయకూడదని హెచ్చరించారు.బాక్సైట్ తవ్వకాల వల్ల అడవులు నాశనం అవుతాయని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, నీటి కాలుష్యం, ఆదివాసీల జీవనోపాధి (కాఫీ, వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు) నాశనం అవుతాయని తెలిపారు. ఆదివాసీల భూమి హక్కులు (ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ 2006), పెసా (ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్) యాక్ట్ ప్రకారం గ్రామ సభల అనుమతి తప్పనిసరి అని, గతంలో ఈ చట్టాలు ఉల్లంఘించబడ్డాయని గుర్తుచేశారు.హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేట్ కంపెనీ లకు అప్పగించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఆదివాసీలు సాంప్రదాయ ఆయుధలతో పోరాటం చేసారని, మళ్లీ అదే పద్ధతి లో ఉద్యమానికి సిద్ధం కావాలి. ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగం ఉపాధి రిజర్వేషన్ పై పోరాటం ఫలితం రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయడం లేదని రౌండ్ టేబుల్ సమావేశం ప్రశ్నించింది. చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రిజర్వేషన్ అమలుకు అసెంబ్లీ సమావేశం లో బిల్లు పెట్టాలని, రిజర్వేషన్ ఇచ్చిన తరువాత మాత్రమే జనరల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలనీ రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది.ఆదివాసీ ప్రజా సంఘాలు ఆదివాసీలతో కలిసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఆదివాసీల హక్కుల కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతుందని నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మానపడాల్, గిరిజన సమాఖ్య జిల్లా కూడా రాధాకృష్ణ,మాజీ ఎంపీపీ సలంగి ఉమామహేశ్వరరావు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గంప రాయి సూరయ్య మాజీ ఎంపీపీ జెర్సింగి సూరి నారాయణ మాజీ ఎంపీపీ చల్లంగి ఉమామహేశ్వరరావు గోమంగి మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం జనసేన పార్టీ కూడా కృష్ణబాబు ఆదివాసి గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు బొండా సన్నీ బాబు ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గంగాధరం ఆదివాసి గిరిజన సంఘం పెదబయలు మండల అధ్యక్షులు జంపరంగి సునీల్ కుమార్ వైసిపి పార్టీ నాయకులు దన రాజు కాంగ్రెస్ పార్టీ చిట్టి ప్రభాకర్ పి మాధవరావు వి ఆనందు పి కృష్ణారావు రసగుల్లా ధనలక్ష్మి కొంట నవీన పాల్గొనడం జరిగినది.

# రసవత్తరం గా మారనున్న కొత్తూరు మండల రాజకీయాలు

**కొత్తూరు ఫిబ్రవరి 24(మేజర్ న్యూస్):**పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు రసవత్తరం గా మారనున్నాయి. మండలపరిషత్, మరియు జడ్పిటిసి లపై అధికార తెలుగు దేశం పార్టీ లో మూడు వర్గాల తో సహా బీజేపి, జనసేన, వైసీపీ పార్టీలు తమ ప్రాబల్యం చాటుకోవాలని ఇప్పటి నుండే పావులు కదుపుతున్నాయి.కూటమి నేతలు తో సహా వైసీపీ నేతలు తమకు అనువైన చోట్ల పోటీ చేసేందుకు ఎవరు ఎక్కడ పోటీ చేయాలో ప్రయత్నాలు చేసుకొంటున్నారు. దేశం వర్గ పోరులో వైసీపీ, జనసేన భారతీయ జనతా పార్టీ కీలకంగా మారనున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు.2013, 2020 లో జిల్లా మండల పరిషత్ లకు ఎన్నికలు జరిగాయి. 2020 ఫిబ్రవరి లో సర్పంచ్ లకు , సెప్టెంబర్ లో యంపిటిసి లు, జడ్పిటిసిలకు ఎన్నికలు జరిగాయి. ఈ రెండు సార్లు జరిగిన ఎన్నికలలో మొదటి సారి ఎంపిపి, జడ్పిటిసి యస్ టి లకు కేటాయించగా 2020 లో యం పిపి యస్ టి లకు, జడ్పిటిసి యస్ సి లకు కేటాయించారు. ఈ సారి ఓపెన్ కేటగిరిలో బిసి, ఓసి లకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల అధికార తెలుగు దేశంలో మూడు వర్గాలు ఎంపిపి, జడ్పిటిసి పదవుల పై ఆశిస్తూ ఇప్పటినుండే తమ ప్రయత్నాలు ప్రారంభించారు.అధికార దేశంపార్టీ నాయకుల తో సహా బీజేపి జనసేన, ప్రతిపక్ష పార్టీ వైసీపీ కూడ పదవులు పై ఆశిస్తున్నారు. ఇప్పటి నుంచే యంపిటిసి లు జడ్పిటిసి లు పార్టీ పరంగా జరగవలసిన ఎన్నికల్లో ఎవరనేది చర్చ జరుగుతోంది. కాబట్టి టిక్కెట్లు కేటాయింపు కీలకంగా వ్యవహరించనున్నారు. వైసీపీ కి పెద్దగా బలం లేకపోయినా ఆ పార్టీ మనుగడ కోసం తమ ప్రయత్నాలు ఇప్పటి నుండే ప్రారంభించింది. కూటమి లో భాగస్వామ్య పార్టీలైన జనసేన, బిజెపి కొన్ని సీట్లలో పోటీ చేయడానికి మిత్ర పక్ష పార్టీలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే కలమట వర్గం కీలకంగా మారనున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సారి జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు కేటాయింపులు ఎమ్మెల్యే కు తలనొప్పి గా మారే అవకాశలు లేకపోలేదని పరిశీలకులు భావిస్తున్నారు. టిక్కెట్లు కేటాయింపు లో ఎమ్మెల్యే సిఫార్స్ లు కీలకం. ఏది ఏమైనా బి ఫారాలు జిల్లా అధ్యక్షులు ఇవ్వాల్సి ఉంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలకతీతంగా ఎవరెవరు ఏ పార్టీ తో కలుస్తారో చెప్పలేని రాజకీయ పరిస్థితులు కొత్తూరు మండల లో ఏర్పడవచ్చునని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తిరుమల తిరుపతి దేవస్థానాన్ని భ్రష్టు పట్టించారు



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్:**హిందువుల ఆరాధ్య దైవం, కలియుగ వైకుంఠంగా పిలవబడిన వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని గత వైసిపి ప్రభుత్వం భ్రష్టు పట్టించారని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవన్లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం హిందువులు మనోభావాలను దెబ్బతీస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం పై ఎన్నో అరాచకాలు చేశారని అన్నారు. తిరుమలలో లడ్డు అంటే ముఖ్య ప్రసాదం అని, అన్య మతస్తులు సైతం స్వీకరించే ఈ ప్రసాదాన్ని నాణ్యత లేకుండా కెమికల్స్, నాసిరకం నెయ్యితో కల్తీ చేసి, హిందువులు మనోభావాలను దెబ్బతీయడంతో దానిని కోర్టులో ఎంక్వయిరీ వేస్తే వాటిని సైతం జగన్ రెడ్డి ఆపడానికి కోర్టు నుండి స్టే తెచ్చుకోవడం సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. ముఖ్యంగా బ్రహ్మోత్సవాలు సమయంలో సతీసమేతంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించాలి కానీ జగన్మోహన్ రెడ్డి ఏరోజు కూడా సతీసమేతంగా పట్టు వస్త్రాలు ఇవ్వకుండా హిందూ సాంప్రదాయాలను కాల రాశాడని అన్నారు. అన్యమతస్తులైన జగన్ రెడ్డి ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమల పర్యవేటించడం, పండితులు, మేధావులు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన దానిని ఏరోజు ఖాతరు చేయలేదు. శ్రీవారిని నల్లరాయి అన్న భూమన కరుణాకర్ రెడ్డికి టిటిడి చైర్మన్ పదవి కట్టబెట్టడం, అన్యమతస్తులు నియామకం, బస్సు టికెట్లపై అన్యమత ప్రచారం, తిరుమల కొండపై అన్యమత గుర్తులు, టిటిడి వెబ్సైట్లో అన్యమత బోధనలు, దర్శనం, వసతి, ప్రసాదాల ధరల పెంచడం వంటి అనేక ఘటనలు తిరుమలను పవిత్రతను దెబ్బతీసి విధంగా జగన్ రెడ్డి చేశారని దుయ్యబట్టారు.అక్కడ ఒక ఉద్యోగి హుండీలో విదేశి కరెన్సీ దొంగలించి సీసీ కెమెరాలో దొరికిపోయినప్పటికి ఆ కేసు రద్దు చేయటం బాదాకరమన్నారు. తల నీలాలు సుమారు రెండు కోట్లు విలువ చేసే ఎగుమతి చేస్తు పట్టుబడినా ఎలాంటి చర్యలు లేవన్నారు. సాక్షాత్తు శాసన సభలో కాళ్లకు పాదరక్షలు వేసుకొని వెంకటేశ్వర స్వామి చిత్రపటాలను చేతులో పట్టుకొవడం ఎంతవరకు సమంజసమన్నారు. గత వైకాపా పాలనలో సుమారు 350 ఆలయాల్లో విగ్రహాలను ధ్వంసం చేసిన ఖండించలేదని, ఇదంతా అన్యమత ముఖ్యమంత్రి కావడంవల్లనే హిందువులు బాదపడే విధంగా చేశారన్నారు. హోటల్ ప్రభుత్వం వచ్చాక ఒకటిన్నర సంవత్సర కాలంలో అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి తాను స్వాగతిస్తున్నానని గోవిందరాజులు తెలిపారు.ఈ సమావేశంలో టిడిపి నాయకులు పాగోటి ముత్తురాజు, మంగి రమణ, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్. రాంకుమార్ పాల్గొన్నారు.

# మునగ సాగుతో రైతులకు ఆదాయం




**మెలియాపుట్టి. ఫిబ్రవరి 24. మేజర్ న్యూస్:**మునగ సాగు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం రైతులకు లభిస్తుందని డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మెలియాపుట్టి వెలుగు కార్యాలయంలో మునగ సాగుపై రైతులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మునగా ఆకు కి మార్కెట్లో మంచి గిరాకీ ఉందన్నారు. చాపర లో మునగ సాగు పంటను పరిశీలించారు. ఈ సందర్భము గా పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిపిఎం నారాయణరావు, వెలుగు ఏపిఎం త్రినాధమ్మ, ఎమ్మెస్ అధ్యక్షురాలు పార్వతి ,తదితరులు పాల్గొన్నారు.

# అన్ని గ్రామాలకు సీసీ రోడ్లు



మెలియాపుట్టి. ఫిబ్రవరి 24. మేజర్ న్యూస్:కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి అన్ని గ్రామాలకు సిసి రోడ్లు వేయడం జరుగుతుందని పిఏసిఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు అన్నారు. మంగళవారం మెలియాపుట్టి మండలంలోని జోడూరు పంచాయతీలో రాజపురం గ్రామంలో స్మశాన వాటిక కు ,జనిబంద నుండి సవర సజినాపురం గ్రామానికి సిసి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నంబాల వెంకట్రావు , స్టేట్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్,ఇప్పిలి కృష్ణరావు మాస్టర్, వసంత్ కుమార్ ,సయ్యద్ సిలార్ ,అజయ్ కుమార్, శ్రీనివాసరావు, లుకలాపు భాస్కరరావు, అతపాకల కోదండరావు, బూరెల శ్రీనివాసరావు, జీరి కృష్ణారావు, బడే కోదండ తదితరులు పాల్గొన్నారు.

# మురుగునీటితో పొంచి ఉన్న ముప్పు!

**- ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం.**

**- అధికారులు స్పందించాలని విజ్ఞప్తి..**



**నరసన్నపేట ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్** :ఒకప్పుడు మంచినీటి చెరువు,ఈ నీటితో పంటలు పండించేవారు. స్థానిక అవసరాలకు ఉపయోగించేవారు. నేడు ఆ చెరువు మురికి కూపంగా మారింది. నరసన్నపేట పట్టణంలోని పలు ప్రాంతాల నుండి మురికి డ్రైనేజ్, సెప్టిక్ ట్యాంకుల నుండి వచ్చే వ్యర్థపు నీరువచ్చి చేరుతుంది. డ్రైనేజ్ పైప్ లైన్ పగిలిపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఆ చెరువు కొంతమందికి ప్రాణ సంకటముగా మారింది. ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లే పరిస్థితి ఏర్పడింది. విషపూరిత దోమలకు ఆవాసంగా మారింది. ఆ చెరువే కొత్త కర్ర చెరువు నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని కొత్త కర్ర చెరువు దుర్గంధపు నీటితో నిండి, దోమలకు ఆవాసంగా మారింది. చెరువులోని అనేక జీవరాసులు, పక్షులు నీటి కాలుష్యం వల్ల చనిపోతున్నాయి. కొత్త కర్ర చెరువులోని మురుగునీరు వల్ల ప్రశాంతి నగర్, గాంధీ నగర్ వీధులలో వీటి వల్ల విపరీతమైన దోమలు, దుర్గంధ సమస్య ఏర్పడింది. మురుగునీరు బయటకు వెళ్లేందుకు ఉన్న మార్గాలు మూసివేశారు. అధికారులు స్పందించి చెరువులో చేరుతున్న డ్రైనేజ్ మురుగునీటిని ఇతర ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని గాంధీనగర్ ప్రశాంతి నగర్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చెరువులోకి వచ్చి



చేరుతున్న ఇందిరానగర్, వంశధార కాలనీ, హట్కో కాలనీ, గాంధీనగర్ 4 వీధులు నుండి మురుగునీరు దారి మళ్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీని ప్రభావంతో గాంధీనగర్, ప్రశాంత్ నగర్ ప్రాంతాలలో ప్రస్తుతం డెంగ్యూ వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. కొత్త కర్ర చెరువు ప్రాంతంలో మురుగునీరు నిల్వ ఉండడం వల్ల పందులకు కూడా ఆవాసంగా మారింది. శ్రీకాకుళం పట్టణంలో ఇటీవల వ్యాపించిన డయేరియా లాంటి రోగాలు నరసన్నపేట లో కూడా వ్యాప్తి చెందే అవకాశం ఉందని గాంధీనగర్ వాసులు అంటున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు, స్థానిక ప్రజా ప్రతిని ధులు, ప్రభుత్వ అధికారులు మురుగునీటి నిల్వలు బయటికి పోయేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వీధి వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్:** జాతీయ సేవా పథకం, మేర యువ భారత్ సంయుక్తం గా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ప్రోగ్రాం ను జిల్లా స్థాయి ఎలాక్యూషన్ (జుశ్రీశీఎిఆశీఅ) పోటీలను మార్చి 5వ తేదిన డా.బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ఎచ్చెర్ల లో నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కెఆర్ రజని చెప్పారు. మంగళవారం సంబంధిన పోస్టర్ ను డా.బి. ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ చేతుల మీదుగా విడుదల చెయ్యడం జరిగింది 18-25సంవత్సరాలు నిండిన ప్రతి యువతి యువకులు మార్చి 2వ తేదీ లోపల మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకొని, మార్చి 5వ తేదిన జరగబోవు పోటీలలో పాల్గొనవాల్సిందిగా తెలియచేశారు. 18-25 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులను వికసిత భారత్ యువ పార్లమెంట్ -- 2026లో నమోదు చేసుకొని పాల్గొనడానికి ప్రోగ్రామ్ ఆఫీసర్లు మరియు అధ్యాపక సభ్యులందరు ప్రోత్సహించవలసిందిగా కోరుతున్నాము.జిల్లా స్థాయి అంశం:"భారత అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)కు 50 సంవత్సరాలు: భారత ప్రజాస్వామ్యానికి నేర్చుకున్న పాఠాలు" నమోదు:విద్యార్థులు తప్పనిసరిగా 2 మార్చ్ 2026 లోపు వీ దీష్ఠుతీఫ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. హాజరు సమయం:నమోదు చేసుకున్న విద్యార్థులు కార్యక్రమం జరిగే ప్రాంగణానికి ఉదయం 9:00 గంటలకు సమయానికి హాజరు కావాలి.భాషలు:ప్రసంగాన్ని హిందీ, ఇంగ్లీష్ లేదా తెలుగు భాషల్లో ఇవ్వవచ్చు. ఎంపిక విధానం:లి జిల్లా స్థాయిలో టాప్ 10 మంది ? రాష్ట్ర స్థాయిలి రాష్ట్ర స్థాయిలో టాప్ 3 మంది ? జాతీయ స్థాయి (న్యూ ఢిల్లీ పార్లమెంట్) ఈ ప్రోగ్రాం జిల్లా మరియు రాష్ట్రాన్ని జాతీయ వేదికపై ప్రతినిధ్యం వహించే అరుదైన అవకాశం. అందరూ విద్యార్థుల అధిక సంఖ్యలో పాల్గొనుటకు సహకరించగలరని పిలుపునిచ్చారు. ఈ కార్రక్రమం లో డా.బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రో.బి.అడ్డయ్య, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.డి. వనజ, ఆర్ట్స్ , లా అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ డా.యం. అనురాధ, పి.యం. ఉషా కోఆర్డినేటర్ డా.యూ .కావ్య జ్యోస్న , డిప్యూటీ డైరెక్టర్ మేర యువ భారత్ ఎన్ . వెంకట ఉజ్వల్ పాల్గొన్నారు.

# శక్తి యాప్ తో తక్షణ పోలీస్ సహాయం



**శ్రీకాకుళం/ ఆమదాలవలస ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్** :శ్రీకాకుళం శక్తి టీం 2 ఆమదాలవలస సర్కిల్ ఇంచార్జ్ తమ్మినేని అమ్మాజి ఆధ్వర్యంలో ఆమదాలవలస పట్టణంలో మహిళలకు మంగళవారం శక్తియాప్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా రక్షణకు శక్తి యాప్ ఉపయోగపడే విధానాన్ని తెలియజేసి మహిళలచే యాప్ డౌన్లోడ్ చేశారు. మహిళలకు ఏ విధమైన చట్టాలు ఉన్నాయో వివరించి, శక్తి యాప్ తో పోలీసులకు ఎలా ఫిర్యాదు చేయవచ్చో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా బాలికా సంరక్షణ కోసం యాప్ రూపొందించిందని అమ్మాజీ వివరించారు. శక్తి యాప్ నందు గల అన్ని రకాల హెల్ప్ లైన్ నెంబర్లు 112,1091,101,1073,1972,1930,1098,108గురించి, డ్రగ్స్ మహమ్మారి నుండి యూత్ ను కాపాడుకోవటం గురించి, పోక్సోచట్టం గురించి, మానవ అక్రమ రవాణా గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. అపరిచితులు అనుమానితులు తిరిగితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆముదాలవలస శక్తి టీమ్ ఇంచార్జి ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ తమ్మినేని అమ్మాజీ, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు

# అరకులోయలో హిందూ సమ్మేళన ర్యాలీ సక్సెస్



**అరకులోయ,ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్:**అరకులోయ మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక సంఘం మంగళవారం నిర్వహించిన హిందూ సమ్మేళన ర్యాలీ విజయవంతమైంది.హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరచి దేశాన్ని విశ్వ గురువుగా నిర్మాణం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన హిందూ సమ్మేళన ర్యాలీలో వేలాదిమంది హిందూ బంధువులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఊహించిన దానికంటే వివిధ ప్రాంతాల నుంచి తతరలివచ్చిన భక్తజనం ర్యాలీలో పాల్గొని దైవభక్తితో నినాదాలు చేశారు. అరకులోయ ముఖ ద్వారంలోని ఎన్టీఆర్ మైదానం వద్ద ప్రారంభమైన హిందూ సమ్మేళన ర్యాలీ స్థానిక పోలీస్ స్టేషన్,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కూడలి మీదుగా శ్రీ వెంకన్న దేవాలయం వరకు కొనసాగింది.ఆర్.ఎస్.ఎస్. 100 సంవత్సరాల ప్రయాణంలో విజయ గాధలను గుర్తు చేసుకుంటూ అరకులోయలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో సమ్మేళనం నిర్వహించారు. హిందూ సమ్మేళనం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కోలాటం,భజనలు,థింసా నృత్యాలు,గుమ్మలాట వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి రాధ మనోహరదాస్ మాట్లాడుతూ ధర్మానికి వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాలను హిందువులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.దేశం పట్ల భక్తి భావం లేకపోతే దేవుడు ప్రసాదించిన అన్నీ కోల్పోతామని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మానవులు వికృత చేష్టలకు పాల్పడకుండా,అధర్మం వైపు వెళ్లకుండా నీతి,నిజాయితీగా జీవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రకృతి ప్రసాదించిన మంచి వాతావరణంలో జీవిస్తున్న ఆదివాసుల సంస్కృతి,సంప్రదాయాలు, ఆచార,వ్యవహారాలకు ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన సూచించారు.భారత రాజ్యాంగం గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చట్టాలను రూపొందించిందని,ఈ నేపథ్యంలో గిరిజన చట్టాలు, హక్కులను కాపాడుకో వలసిన అవసరం ఎంతైన ఉందని ఆయన నొక్కి చెప్పారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఆదివాసుల కోసం గ్రీన్ కారిడార్ పరిచిందన్నారు. అల్లూరి సీతారామరాజు ప్రాణ త్యాగం చేసిన ఈ గెడ్డపై పుట్టిన వారంతా అదృష్టవంతులుగా భావిస్తున్నామని స్వామి రాధ మనోహరదాస్ పేర్కొన్నారు. అనంతరం శ్రీ వెంకన్న దేవాలయం ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి,ఉప మండల కమిటీ కార్యకర్తలు,గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సెంట్రల్ జైల్ ను సందర్శించిన న్యాయ సేవాధికార కార్యదర్శి సన్యాసినాయుడు



**ఆరిలోవ,ఫిబ్రవరి24, మేజర్ న్యూస్** :ఆంధ్ర ప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాలమేరకు కార్యాచరణ ప్రణాళిక 2025-2026 లో భాగంగాజిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మంగళవారం విశాఖ సెంట్రల్ జైలును సందర్శించారు. ఈ సందర్శనలోఅవగాహన కార్యక్రమం నిర్వహించారు జైలు వాసులకు అందించే చట్టపరమైన సేవలు,జైలు చట్ట సేవలు,క్లినిక్ పనితీరు, ఆహారం, సౌకర్యాలు ఇతర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన జైలు ఖైదీలతో మాట్లాడి వారి హక్కులు, ఉచిత చట్ట సహాయ విధానాలు, లోక్ అదాలత్ ల ద్వారా వివాదాల పరిష్కారం,బెయిల్, ప్రమాద స్వేచ్ఛా పిటీషన్ల విషయాలపై అవగాహన కల్పించారు.జైలు వాసులకు అందించే ఆహారం, పానీయాలు, వైద్య సౌకర్యాలు, శుభ్రత, ఇతర ప్రాథమిక వాస్తవాలను పరిశీలించి, అవసరమైతే మెరుగుపరచాలని జైలు అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ జైల్ అధికారులు, సిబ్బంది పాల్గున్నారు.

## ప్రశాంతి విద్యాసంస్థలలో ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

**- కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సజావుగా నిర్వహణ**

**- పోలీస్ బందోబస్తు మధ్య కఠినంగా పరీక్షలు**



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 24, మేజర్న్యూస్:** అచ్యుతా పురంలోని ప్రశాంతి విద్యాసంస్థల పరిధిలో నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీ క్షలు మంగళవారం ప్రశాంత వాతా వరణం లో పూర్తయ్యాయి. ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి పరీక్షలను సజావుగా నిర్వహించారు. ప్రశాంతి కాలేజ్, అచ్యుత కాలేజ్, క్రైట్స్ కాలేజ్, మునగపాక ఆదర్శ పాఠశాల కేజీబీవీ, ఉషోదయ కాలేజీ నుంచి పరీక్షలకు వందలాది మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. పర్యవేక్షణను కఠినంగా అమలు చేసి, నియమ నిబంధనలకు అనుగుణంగా పరీక్షా ప్రక్రియను పూర్తి చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతి విద్యాసంస్థల యాజమాన్యం ముందస్తు చర్యలు తీసుకోవడంతో పరీక్షా వాతావరణం ప్రశాంతంగా నెలకొంది. పరీక్షలు ముగిసిన అనంతరం విద్యార్థులు ఆనందంతో కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. ప్రశ్నాపత్రాలు సులభంగా ఉన్నాయని, సమయం సరిపడిందని పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. కేంద్రాల వద్దకు వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలను అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం మీద పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా జరుగుతున్నాయని ప్రశాంతి కాలేజ్ అధినేత దర్మి రెడ్డి ప్రసాద్ తెలిపారు

## వైద్య సేవలపై జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం సమీక్ష

**- మాట్లాడుతున్న టాస్క్ ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ ప్రశాంతి**



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 24, మేజర్న్యూస్:** మాతా శిశువులకు సకాలంలో సేవలు అందించడం ద్వారా వారి మర ణాలను నివారించవచ్చునని జిల్లా టాస్కోర్స్ ప్రధాన అధికారి ణి డాక్టర్ జె. ప్రశాంతి అన్నారు. సోమవారం టాస్కోర్స్ బృం దం సభ్యులు హరిపాలెం పీహెచ్సీ పరిధిలోని ఎం. జగన్నాథ పురం హెల్త్ క్లినిక్ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లే కుండా చూడాలని సిబ్బందికి సూచించారు. గర్భిణుల్లో హైరి స్క్ ఉన్న వారిని గుర్తించి సకాలంలో తగిని వైద్యసేవలు అంది చాలన్నారు. గర్భిణులు, పిల్లల సేవలపై ఆన్లైన్ పోర్టల్లో నమో దైన వివరాలను పరిశీలించి సిబ్బందికితో మాట్లాడారు. ఈ కా ర్యక్రమంలో టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు గణాంకాధికారి రా మచంద్రరావు, డీపీవో జగదీష్, జనార్దన్, సర్పంచ్ కరెడ్ల బుల్ల మ్మ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రామలక్ష్మిపాల్గొన్నారు.

## సహకార ఉద్యోగులు సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి బిసిఐటియు



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 24, మేజర్న్యూస్:** 16 2.2025 నుండి నిరవధిక సమ్మె లోనికి సహకార ఉద్యోగులు వెళ్లడం జరిగింది. ఈ సమ్మె ఈరోజు 9వ రోజుకు చేరుకుంది .దీనిలో భాగంగా ఈరోజు ఎలమంచిలి డిసిసిబి వద్ద నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమకు సి ఐ టి యు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడి మద్దతు తెలిపారు .అనకాపల్లి జిల్లా విశాఖ కోఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ ఉద్యోగుల యూనియన్ రాయివరపు శివరామకృష్ణ మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా రైతులకు ప్రాథమిక స్థాయిలో ఎరువులు ,విత్తనాలు ,సకాలంలో అందేలా సహకార ఉద్యోగులకు సేవలు అందించారు. 2019మార్చిలో జీవో నెంబర్ 36 విడుదల చేయడం చేసినా నేటికి ప్రభుత్వాలు సదర జీవో ను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయి. అయితే దేవుడు వరమిచ్చిన పూజారి వరము ఇవ్వని చందంగా అధికారులు జీవో ను అమలుచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. జీవో నెంబర్ 36ను, లాభనష్టాలతో సంబంధం లేకుండా పిఎసిఎస్ ఉద్యోగులకు తక్షణమే అమలు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వవలెను. 36 జీవోలో పేర్కొన్న విధంగా డిస్ట్రిక్ట్ లెవెల్ సపోర్ట్ ఫండ్ ఆప్కాబ్. మరియు డిసిసిబి వారు రిలీజ్ చేయవలెను 2019 సంవత్సరం తర్వాత జాయిన్ అయిన ఉద్యోగులందరును పర్మినెంట్ చేయవలెను. పదవి విరమణ వయసు 62 సంవత్సరంలకు పెంచవలెను. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా గ్రాడ్యుటీ సహకారు ఉద్యోగులకు కేవలం లక్ష రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. కావున సదర్ గ్రాడ్యుటి చట్టప్రకారం అమలు చేయవలెను. ఉద్యోగులకు టర్మ్ ఇన్సూరెన్స్ 20 లక్షల రూపాయలు చేయవలెను. డివిడెంట్ రైతులకు తక్షణమే రిలీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సహకార సంఘాల ఉద్యోగులు యూనియన్ ప్రధాన కార్యదర్శి గొంప రమణ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మద్దల లోవ రాజు, పి నాగభూషణం, కే శ్రీనివాస్, వై ప్రసాద్, ఎం ఎల్ నాయుడు, సుంకర రవి, రాజన్న శంకర్రావు వీరితో పాటుగా ఎలమంచిలి, నక్కపల్లి ,అచ్యుతాపురం, అడ్డరోడ్డు, పాయకరావుపేట, కోటవురట్ల, పరిధిలో గల అన్ని పిఎసిఎస్ బ్రాంచ్ ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.

## మాకవరపాలెంలో ఉపాధి హామీ ప్రజావేదిక



**మాకవరపాలెం, ఫిబ్రవరి 24, మేజర్న్యూస్:** మాకవరపాలెం మండలంలో 2024-25 సంవత్సరానికి గాను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై అధికారులు సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి డ్వామా పిడి పూర్ణిమ దేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 1650 పనులకు గాను సుమారు 26 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీల కార్యక్రమంలో గుర్తించిన నివేదికలను డిపిఎంలు వివరించారు. మండలంలో శెట్టిపాలెంలో పనులు తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన పిడి పూర్ణిమదేవి ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు, ఏపీవోలను అభినందించారు. బూరుగుపాలెం లో పనులు చేపట్టడం లేదని సర్పంచ్ వబ్బలరెడ్డి వెంకటరమణ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారంలో ఆరు రోజులు పనులకు వెళ్తుంటే కేవలం మూడు రోజులు మాత్రమే మస్తులు వేస్తున్నారని అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన పీడీ మాట్లాడుతూ రేపటి నుంచే బూరుగుపాలెంలో పది శ్రామికులకు పనులు ప్రారంభం కావాలని ఎంపీడీవో, ఏపీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పెట్ల సచివేని వైయస్ ఎంపీపీ తుల్లు రాజారావు, ఎంపీడీవో చాయసుధా, విజిలెన్స్ ఆఫీసర్ డి.శ్రీలలిత, అంబుడ్స్ మెన్ వేణుగోపాల్, ఎస్ఆర్పి సిహెచ్.రామచంద్ర, ఏపీవో కాశి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం పరిశీలన

**: సీఐ చంద్రశేఖరరావు**



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 24, మేజర్న్యూస్:** ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో మంగళవారం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని స్థానిక సీఐ ఆర్ వి వి ఎస్ చంద్రశేఖర రావు సందర్శించారు. ముందుగా పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు పరీక్ష కేంద్రాల సమీపంలో గుంపులుగా చేరకుండా సహకరించాలని కోరారు. పరీక్షల సమయంలో కాపీలను ప్రోత్సహించే ప్రయత్నం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కర్నూలు న్యాయవాదిపై దాడి ఘటనకు నిరసనగా యలమంచిలి బార్ అసోసియేషన్ కోర్టు బహిష్కరణ



**అచ్చుతాపురం, ఫిబ్రవరి 24, మేజర్న్యూస్:** కర్నూల్కు చెందిన న్యాయవాది ఎం.పవన్ కుమార్ పై 4వ టౌన్ సీఐ భౌతిక దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, యలమంచిలి న్యాయ వాదులు కోర్టు విధులను బహిష్క రించారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన యలమంచిలి బార్ అసోసియేషన్ సభ్యులు, సంబంధిత సీఐపై వెంటనే సస్పెన్షన్ విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తల్లా సత్యనారాయణ, కార్యదర్శి ఎల్.వి. రామకృష్ణ, ఎస్.శ్రీనివాస్ పట్నాయక్ మరియు ఇతర న్యాయవాదులు ఈ నిరసనలో పాల్గొన్నారు. న్యాయవాదుల భద్రతకు భంగం కలిగించే చర్యలను సహించబోమని వారు స్పష్టం చేశారు.

## జాతీయ రహదారి పక్కన ఉన్న వ్యభిచార గృహాలను మూసివేయాలంటూ

**- ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు**



**అచ్చుతాపురం, ఫిబ్రవరి 24, మేజర్న్యూస్:** యలమంచిలి మండలంలోని జాతీయ రహదారి మర్రిబంద సమీపంలో గల రోడ్డుకి ఇరు వైపులా బహిరంగంగా వ్యభిచార గృహాలు నిర్వహి స్తున్నారని వీటి పై చర్యలు తీసు కోవా లంటూ మండలానికి చెందిన చాకలి నూక రాజు ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. మండలంలో పలు ప్రాంతాలలో రాత్రి పగలు సమయం లేకుండా జాతీయ రహదారి ఆనుకుని ఉండే గ్రామాలలో వ్యభిచార గృహ నిర్వహిస్తున్నారని వీటిపై ఫిర్యాదులు ఉన్న స్థానిక పోలీసులు పట్టించు కోవడం లేదని అంటూ ప్రత్యేక అధికారి దర్యాప్తు చేయించి వ్యభిచార గృహాలను నిర్మూలించాలని కోరారు. ఈ సందర్భంగా చాకలి నూకరాజు మాట్లాడుతూ ఈ ఫిర్యాదు ప్రజా హితం కోసమేనని ప్రధానంగా యువత పెడదోవ పడు తున్నారని అన్నారు. ఈ వ్యభిచార గృహాలను తొలగించాలని కోరారు.

# గ్లోబల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోవైజ్ఞానిక ప్రదర్శన..



**పెద గంట్యాడ, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** సాధారణ ప్రదర్శనలా ప్రారంభమైన కార్యక్రమం, చివరకు విద్యార్థుల ఆవిష్కరణల పండుగగా మారింది. గ్లోబల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన విశాఖలో జ్ఞానోత్సాహాన్ని రగిలించింది. పాఠ్యపుస్తకాలకే పరిమితమైన శాస్త్రాన్ని ప్రాక్టికల్ ప్రపంచానికి తీసుకువచ్చిన ఈ వేదికపై చిన్నారుల నుంచి యువత వరకు తమ ప్రతిభను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక శక్తి, స్మార్ట్ సాంకేతిక పరిష్కారాలు, గణిత నమూనాలు , ప్రతి విభాగంలోనూ విద్యార్థుల సృజనాత్మకత ప్రతిఫలించింది. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రదర్శనను ప్రారంభించి ప్రతి స్టాల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. ప్రాజెక్టుల వెనుక ఉన్న ఆలోచనను విద్యార్థులనే అడిగి తెలుసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "సైన్స్ అంటే పుస్తకాలలోని సూత్రాలు మాత్రమే కాదు, జీవన విధానాన్ని మార్చే శక్తి" అని పేర్కొంటూ పరిశోధనాత్మక దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు ఇది కేవలం పోటీ కాదు, తమ ఆలోచనలకు గుర్తింపు పొందిన వేదికగా మారింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా విశాఖలో శాస్త్రీయ చైతన్యానికి కొత్త ఊపు లభించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి: స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** చట్టసభల పనితీరు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కోసం మంగళవారం 510 మంది విద్యార్థులు ఏపీ శాసనసభను సందర్శించారు. పది రోజులుగా సాగుతున్న ఈ విజ్ఞాన యాత్రలో ఇప్పటివరకు 93 పాఠశాలల నుండి 3,311 మంది విద్యార్థులు అసెంబ్లీని వీక్షించారు. సభా విరామ సమయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు విద్యార్థులతో ముచ్చటించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులకు త్వరలో పోలవరం ప్రాజెక్టు చూసే అవకాశం కల్పిస్తామన్నారు. యువత కేవలం ఉద్యోగాలతో కుటుంబానికే పరిమితం కాకుండా, ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

# హెల్మెట్ ధారణ...ప్రాణాలకు రక్షణ..

**– ఏయూ ఉద్యోగుల హెల్మెట్ ఫర్ లైఫ్ బైక్ ర్యాలీ – అభినందించిన పోలీస్ కమీషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి**



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** నగర ప్రజల్లో హెల్మెట్ ధారణ పట్ల అవగాహన కల్పించే విధంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ ఫర్ లైఫ్ ర్యాలీని నగర పోలీస్ కమీషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ప్రారంభించారు. ఏయూ పరిపాలనా భవనం నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ సిరిపురం కూడలి, ఆల్ ఇండియా రేడియో, ఆర్.కె బీచ్ మీదుగా ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు సాగింది. ర్యాలీని ప్రారంభించిన అనంతరం పోలీస్ కమీషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ... ఇటువంటి ప్రజోపయోగ కార్యక్రమాన్ని నిర్వహించిన ఏయూ యాజమాన్యాన్ని, అధికారులను, ఉద్యోగులను అభినందిస్తున్నామన్నారు. నో హెల్మెట్ నో ఫ్యూయల్ నిబంధనను అమలు చేస్తున్నామన్నారు. పోలీసులకు సహకరిస్తూ ప్రతీ వ్యక్తి హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరిస్తే 88 శాతం వరకు తలకు గాయాలయ్యే ప్రమాదాన్ని నివారించడం జరగవవచ్చున్నారు. హెల్మెట్ ధారణ వలన 40 శాతం వరకు మరణాలు తగ్గుతాయన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు, వెనుక కూర్చునే వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరుతున్నామన్నారు. హెల్మెట్ ధరించడం సురక్షిత ప్రయాణం కొనసాగించండి అనే నినాదం ముందుకు తీసుకువెళ్లాలన్నారు. నాణ్యమైన హెల్మెట్ ధరించడం, సరిగ్గా ధరించడం ఎంతో ప్రధానమన్నారు.ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ హెల్మెట్ ఫర్ ఆల్– సేవ్ లైఫ్... నినాదంతో ఏయూ విద్యార్థులు, ఉద్యోగుల భాగస్వామ్యంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రాణాలను రక్షించడం వీలవుతుందన్నారు. ప్రతీ వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, సురక్షితంగా ప్రయాణం చేయాలని విజ్ఞప్తి చేసారు. శతాబ్ది ఉత్సవాలలో భాగంగా సమాజాన్ని అనుసంధానం చేసే కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య జాలాది రవి,ఆచార్య కె.సీతామాణిక్యం,ఆచార్య డి.నగరాజ కుమారి,ఆచార్య జి. గిరాజ శంకర్, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్. హరనాథ్, పలువురు డీన్లు, అధికారులు, ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ పనితీరుపై ప్రజల అసంతృప్తి

**– పెందుర్తిలో పెరిగిన కబ్జాల సంఖ్య – విధులు నిర్వహించడంలో లేదు బాధ్యత – అక్రమ దారులకు సహకరిస్తున్నారని ప్రజల మండిపాటు – ఈ తాసిల్దార్ వచ్చిన తర్వాతే అధిక శాతం భూకబ్జాలు జరిగాయని ఆరోపణలు**

**పెందుర్తి, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** నగరంలో ఎక్కడా లేనంతగా విస్తరించి ఉన్న ప్రభుత్వ భూములు అధిక సంఖ్యలో పెందుర్తి రెవెన్యూ పరిధిలో ఉండటం విశేషం అధిక శాతం కబ్జాలకు గురవుతున్న ప్రాంతం ఇదే అని చెప్పవచ్చు పెందుర్తిలో సామర్థ్యం కలిగిన తాసిల్దారులు లేకపోవడం పనితీరుపై అవగాహన లేకపోవడం ప్రభుత్వ వనరులను కాపాడే ఉద్దేశం లేకపోవడమో తెలియదు అధిక శాతం ప్రభుత్వ భూములు కబ్జా గురవుతున్న పెందుర్తి తాసిల్దార్కి చీమకుట్టినట్టైనా లేదు ఈయన సొంత ఆస్తులు కాదు కదా ప్రజల సంపద అన్యాక్రాంతమైపోతున్న పట్టించుకోని ఈయన వైఖరి చూస్తే ఈ తాసిల్దార్ మాకు వద్దు బాబోయ్ అని ప్రజలు అంటున్నారు. 123 సర్వే నంబర్లు గతంలో 38 మంది ఫిర్యాదు చేయగా గత తాసిల్దార్ ఈ యొక్క ప్రభుత్వ భూముల నిర్మాణం జరగకుండా నిలిపివేశారు ఇప్పుడున్న తాసిల్దార్ వెంకట అప్పారావు 123 ప్రభుత్వ భూములో నిర్మాణాన్ని ఆపామని నోటీసు ఇచ్చామని చెబుతూనే ఈ నిర్మాణ కొనసాగించుకునే దిశగా ఆయన సహకారం అందిస్తున్నారని స్థానికులు అంటున్నారు ఆర్డిఓ సైతము ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న నిర్మాణాలకు సహకరిస్తున్నారు అని స్థానికులు అంటున్నారు జిల్లా కలెక్టర్ 123లో జరిగిన కబ్జాను నిలిపివేయాలని ప్రభుత్వ భూమిని స్వాధీన పరుచుకొని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ తీరునుపై ఉన్నత అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు



# డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు పై అవగాహన కార్యక్రమం

**– పెందుర్తిలో పోలీసుల ప్రజలతో ముఖాముఖీ – యువత భవిష్యత్తు కాపాడాలని సీఐ కె.వి. సతీష్ కుమార్ పిలుపు**

**పెందుర్తి, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** పెందుర్తి పోలీస్ స్టేషన్ సీఐ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో, స్టేషన్ పరిధిలోని రైతు బజార్ సమీపంలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య సభ్యులు, స్థానిక ప్రజలు, వ్యాపారులు పాల్గొన్నారు. "డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు వద్దు -- ఆరోగ్యం, జీవితం ముద్దు" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ సతీష్ మాట్లాడుతూ, యువత మరియు విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడటం వల్ల వారి బంగారు భవిష్యత్తు నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ప్రశాంతంగా ఉండాల్సిన కాలనీలు, విద్యాసంస్థలు మత్తు పదార్థాల కారణంగా అశాంతి కేంద్రాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. అక్రమార్జన కోసం డ్రగ్స్ మరియు గంజాయి వ్యాపారం చేస్తున్న మాఫియా యువత జీవితాలను బలితీసుకుంటున్నారని హెచ్చరించారు. యువత ఆరోగ్యకరమైన జీవితం గడపాలంటే, తల్లిదండ్రుల ఆశలు నెరవేరాలంటే, విద్యాసంస్థలు మరియు నివాస ప్రాంతాలు ప్రశాంత వాతావరణంతో ఉండాలంటే మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గంజాయి కలిగి ఉండటం, రవాణా చేయడం, విక్రయించడం లేదా సేవించడం వల్ల కలిగే చట్టపరమైన శిక్షలు, ఆరోగ్యపరమైన మరియు సామాజిక దుష్పరిణామాలను ఉదాహరణలతో వివరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా లేదా విక్రయాలపై ఎవరైనా సమాచారం తెలిసిన వెంటనే పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో మత్తు పదార్థాల నిర్మూలనపై చైతన్యం పెంపొందించడం, యువతను సన్మార్గంలో నడిపించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్థానిక ప్రజలు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు తమ పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.



## ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో నేత్రశాలలో ఓపీ బ్లాక్ ప్రారంభం



**విశాఖపట్నం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రాంగణంలో నూతన ఓపీ బ్లాక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ భవన నిర్మాణానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్పొరేట్ ఎన్విరాన్మెంటల్ రెస్పాన్సిబిలిటీ (జజు=) నిధుల ద్వారా రూ.76 లక్షలు మంజూరు చేసింది. ఈ నిర్మాణ పనులను విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి జి విద్యాధరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వైజాగ్ టెర్మినల్ జనరల్ మేనేజర్ అంబటి మహేశ్వర్ రాజు భవన నిర్మాణ పత్రాలను ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వీ మీనాక్షి కు అధికారికంగా అందజేశారు. కార్యక్రమంలో మాట్లాడిన జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. డాక్టర్ వీ మీనాక్షి మాట్లాడుతూ, కొత్త ఓపీ బ్లాక్‌లో రెటీనా, గ్లకోమా మరియు కార్నియా ప్రత్యేక వైద్య సేవలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల రోగులకు మరింత నాణ్యమైన చికిత్స అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు నిశాంత్, బుచ్చయ్య, సాగర్ పాల్గొన్నారు. అలాగే ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రొఫెసర్లు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రేమలత, ఆర్ఎంఓ డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ శ్రీ లక్ష్మి తదితర వైద్యులు మరియు సిబ్బంది హాజరయ్యారు.

## మొల్లేటి జీవన సింధూర పుట్టినరోజు సందర్భంగా ఉపాధి శ్రామికులకు అన్న సమారాధన



**మునగపాక, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** బాపూజీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు, జనసేన నేత మొల్లేటి వెంకట భోగేశ్వరరావు కుమార్తె జీవన సింధూర పుట్టినరోజు సందర్భంగా పాటిపల్లి ఆవ లో ఉపాధి పనులు చేపడుతున్న ఉపాధి శ్రామికులకు సుమారు 70 మంది కి భోగేష్ భోజనాలు ఏర్పాటు చేశారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భోగేశ్వరరావు భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆకలితో ఉన్న అన్నార్తులను ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏట పేదలకు బట్టలు, బియ్యం, పండ్లు, కూరగాయలు అందిస్తూ తన సేవా భావాన్ని చాటుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవిందా, జోగి నాయుడు, మెట్లు పూర్ణచంద్రరావు, కనక, సంతోషి, ధనలక్ష్మి, నూకరత్న, జనసేన నేత ఆడారి భాస్కరరావు, కోయిలాడ లక్ష్మణరావు, కొయిలాడ రమణ, పలువురు ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

## ఉపమాక వెంకన్న ఆలయానికి అభివృద్ధి పనులు



**నక్కపల్లి, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** ఉపమాక వెంకన్న ఆలయ సమీపాన జరుగుతున్న పనులు పర్యవేక్షించిన ఎషియన్ పెయింట్స్ ప్లాంట్ హెడ్ మౌనిక్ చటర్జీపర్యవేక్షిం చారు.మంగళవారముఉపమాక వెంకన్న దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ హోం మంత్రివర్యులు వంగలపూడి అనిత ఆదేశాలు మేరకు, ఆలయ సమీపాన రెండు చెరువులు కి వాకింగ్ ట్రాక్, భక్తులు కూర్చొని చెరువుని చూసేందుకు అనువుగా బెంచులు,సోలార్ లైట్స్, చెరువుకి నీరువచ్చే కాలువ అభివృద్ధి చేపట్టి ఆలయ అభివృద్ధి కి అన్నిరకాలుగా సహాయ పడుతామని వారుచెప్పారు. ఆయన వెంట కంపెనీ సియస్ ఆర్ ప్రతినిధులు,నక్కపల్లి పిఎసియస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, పార్టీ ప్రెసిడెంట్ కొప్పిశెట్టి శ్రీను, తోలేటి శ్రీను, కొప్పిశెట్టి వాసు పాల్గొన్నారు.

## 26న మునగపాక అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం



**మునగపాక, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన మునగపాకలో ప్రసిద్ధి చెందిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయా వార్షికోత్సవం 26న గురువారం ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు, గురువారం దశమి రోజున ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకములు, సాయంత్రం ఐదు గంటలకు భజనలు, కోలాటములు, సంకీర్తనలతో, స్వామివారి ఉంజల సేవ నిర్వహిస్తున్నారని ఆలయ కమిటీ తెలిపారు, ఈ కార్యక్రమంలో మొల్లేటి సత్యనారాయణ, ఆడారి కాశి బాబు,దిమ్మల అప్పారావు, కోనపల్లి రామ మోహన్ రావు, పొన్నాడ కిరణ్, జల్లేపల్లి కృష్ణ, దాడి పోలీస్, తదితరులు పాల్గొన్నారు

## ఉప్పవరంలో పనికి ఆహార పథకం పనులు ప్రారంభం



**అచ్చుతాపురం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** ఎలమంచిలి నియోజకవర్గం అచ్చుతాపురం మండలం ఉప్పవరం గ్రామంలో కూటమి నాయకులు ఆదేశాల మేరకు మన గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పనులు ఎం జగన్నాధపురం జనసేన పార్టీ సీనియర్ నాయకులు కరెడ్ల ప్రకాష్ నిర్వహణలో ప్రారంభించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఉప్పవరం గ్రామ ఉపసర్పంచ్ కూని శెట్టి సత్తిబాబు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు కొలగని శేషు , చిన్ని శేషగిరిరావు , చిన్ని ధర్మరాజు జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీ చిన్ని దొరబాబు , ఉపాధ్యక్షులు కాయలు అప్పలరాజు , బీసీ అధ్యక్షులు కోమాకుల రవి ప్రసాద్ యూత్ ప్రెసిడెంట్ పల్లెల రామ గణేష్ కొత్తపల్లి ధర్మ అలాగే ఎనర్జీ ఎస్ టిఎల్ శ్రీ రమేష్ విఆర్పి ఇన్చార్జి బత్తిన రాజు తదితరులు పాల్గొన్నారు

## మ్యాథ్స్ ఒలింపియాడ్లో మెరిసిన విద్యార్థిని వర్షిత



**నక్కపల్లి, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** మ్యాథ్స్ ఒలింపియాడ్లో మెరిసిన నక్కపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని పూడి వర్షితఆరో ర్యాంకు సాధించిందని ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జూనియార్ స్థాయి లో జరిగిన 52వ మ్యాథ్స్ ఒలింపియాడ్లో ఆరో ర్యాంకు సాధించిందని ప్రిన్సిపాల్ అన్నారు. ఒలింపియాడ్లో గెలుపు సాధించిన పూడి వర్సితను గుంటూరు జిల్లాలో ఆర్వీఆర్, జెసి ఇంజినీరింగ్ కళాశాలలో సన్మానం చేసి ప్రసంశపత్రం,, మ్యాజిక్ ఎస్క్వారే బుక్ బహుకరించారని ప్రిన్సిపాల్ తెలిపారు. వర్షితకు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సిబ్బంది అభినందించారు.

## ఏఆర్ బలగాల వార్షిక డీ-మొబిలైజేషన్ ముగింపు

### – పోలీసుల నైపుణ్యమే సమాజ రక్షణకు ప్రాధాన్యత – జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా.



**అనకాపల్లి, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** అనకాపల్లి జిల్లా సాయుధ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి గత 15 రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక డీ–మొబిలైజేషన్ కార్యక్రమం మంగళవారంతో విజయవంతంగా ముగిసింది. విశాఖపట్నం, కైలాసగిరి పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ ముగింపు వేడుకకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ముఖ్య అతిథిగా హాజరై, సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. ?రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారావు నేతృత్వంలో జరిగిన పోలీసు బలగాల కవాతును ఎస్పీ వీక్షించి, వారి క్రమశిక్షణను అభినందించారు. ??ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికత, సోషల్ మీడియా ప్రభావం దృష్ట్యా పోలీసులు తమ పనితీరులో నూతన దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పోలీస్ అంటే భయం కాదు, భరోసా అనే భావన ప్రజల్లో కల్పించాలని, ప్రతి చర్యలో పారదర్శకత, మానవత్వం ఉండాలని సూచించారు. అక్రమ సమావేశాలు, అనుమతి లేని ర్యాలీలను నియంత్రించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉంటూ, చట్టపరమైన నిబంధనల ప్రకారం శాంతియుతంగా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ 15 రోజుల్లో నేర్చుకున్న ఆయుధాల వినియోగం, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, మాబ్ కంట్రోల్ వంటి నైపుణ్యాలు విధి నిర్వహణలో వెన్నెముకలా నిలుస్తాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 4 నుండి 18 వరకు జరిగిన ఈ శిక్షణా కాలంలో సుమారు 240 మంది ఏ.ఆర్.సిబ్బందికి ఈ క్రింది అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు, ఎస్.బి. డీఎస్పీ జీ.ఆర్.ఆర్.మోహన్, ఆర్మ్డ్ రిజర్వ్ అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మధరావు, రమణమూర్తి, సంజీవరావు, ఆర్ఎస్సై ఆదినారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూమి ధరల ఎఫెక్ట్: విశాఖపట్నంలో హైరైజ్‌ల కొత్త దశ

**విశాఖపట్నం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం నగరం వేగంగా మారుతోంది. ఐటీ, పరిశ్రమలు, విద్యా--ఆరోగ్య రంగాల విస్తరణతో జనాభా ఒత్తిడి పెరుగుతోంది. ఇదే సమయంలో నగర పరిధిలో భూమి ధరలు భారీగా పెరగడం, పెద్ద స్థలాల లభ్యత తగ్గిపోవడం రియల్ ఎస్టేట్ రంగాన్ని కొత్త దిశగా నడిపిస్తోంది. ఒకప్పుడు విస్తార స్థలాల్లో తక్కువ అంతస్తుల అపార్ట్‌మెంట్లు కనిపించగా, ఇప్పుడు ఆకాశాన్ని తాకే హైరైజ్ టవర్లు నగర ఆకృతిని మార్చేస్తున్నాయి.

### - భూమి ఖర్చు -- ప్రాజెక్టుల ఆర్థిక సమీకరణ

ప్రధాన ప్రాంతాల్లో భూమి ధరలు గణనీయంగా పెరగడంతో లోరైజ్ ప్రాజెక్టులు ఆర్థికంగా కష్టసాధ్యమవుతున్నాయి. పరిమిత స్థలంలో ఎక్కువ గృహ యూనిట్లు నిర్మించడం ద్వారా భూమి వ్యయాన్ని విభజించడం హైరైజ్‌ల ద్వారా సాధ్యమవుతోంది. దీంతో డెవలపర్లు నిలువు నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. క్రెడాయి విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షులు ఇ అశోక్ కుమార్ అభిప్రాయం ప్రకారం, "నిలువు నిర్మాణం భూమి వినియోగాన్ని సమర్థవంతం చేయడమే కాకుండా ప్రాజెక్టుల సాధ్యసాధ్యతను పెంచుతుందని పట్టణ సాంద్రత పెరిగే కొద్దీ హైరైజ్‌లే దీర్ఘకాలిక పరిష్కారం" అని పేర్కొంటున్నారు.

### - కొనుగోలుదారుల అభిరుచుల్లో మార్పు

మారుతున్న జీవనశైలికి అనుగుణంగా గృహ కొనుగోలుదారుల అభిరుచుల్లో కూడా మార్పు వచ్చింది. భద్రతా వ్యవస్థలు, ప్రత్యేక పార్కింగ్, క్లబ్‌హౌస్‌లు, జిమ్, స్విమ్మింగ్‌పూల్, పిల్లల ఆట స్థలాలు వంటి భాగస్వామ్య సౌకర్యాలపై ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ సౌకర్యాలను సమగ్రంగా అందించడానికి హైరైజ్ ప్రాజెక్టులు అనుకూలంగా ఉంటున్నాయి.

### - వృద్ధి కారిడార్లలో నిర్మాణాల ఊపు

మధురవాడ--కాపులుప్పాడ, ఆనందపురం--కొమ్మాది, యెండాడ--రుషికొండ తీర ప్రాంతం, భోగాపురం వైపు విస్తరిస్తున్న ప్రాంతాల్లో కొత్త హైరైజ్ ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమవుతున్నాయి. రహదారి విస్తరణలు, మెరుగైన కనెక్టివిటీ, సమీపంలో అభివృద్ధి చెందుతున్న ఐటీ--వ్యాపార కేంద్రాలు ఈ ప్రాంతాలకు ఆకర్షణగా మారాయి.

### - ఐటీ రంగం ప్రభావం

ఐటీ రంగం, స్టార్టప్ సంస్థలు, అనుబంధ సేవా రంగాల వృద్ధి గృహ డిమాండ్‌ను నిలబెడుతోంది. యువ ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలు ఆధునిక సౌకర్యాలతో కూడిన అపార్ట్‌మెంట్లను కోరుకుంటున్నారు. దీని వల్ల హైరైజ్‌లకు స్థిరమైన మార్కెట్ లభిస్తోంది.

### - సవాళ్లు కూడా ఉన్నాయి

అయితే నిలువు విస్తరణకు తగిన మౌలిక సదుపాయాల మద్దతు అత్యవసరం. నీటి సరఫరా, మురుగు నిర్వహణ, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళిక అవసరం. నియంత్రణ స్పష్టత, త్వరిత అనుమతులు, అగ్ని భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు కావాలి. భవిష్యత్ దిశ భూమి పరిమితులు, పెరుగుతున్న జనాభా, మారుతున్న మార్కెట్ అవసరాల దృష్ట్యా విశాఖపట్నం భవిష్యత్తు నిలువు వృద్ధిలోనే ఉందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రణాళికాబద్ధంగా, మౌలిక సదుపాయాలకు అనుగుణంగా అభివృద్ధి జరిగితే హైరైజ్‌లు నగరాన్ని ఆధునిక మహానగరంగా తీర్చిదిద్దగలవని నిపుణులు భావిస్తున్నారు. విశాఖలో రాబోయే రోజుల్లో ఆకాశహర్మ్యాల సంఖ్య పెరగడం ఖాయమనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# జీడి రైతుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలి

### - జీడి పిక్కకు కేజీ 200/ రూపాయలు ఇవ్వాలి



**వి.మాడుగుల, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** మండలం జాలంపల్లి పంచాయతీ లో జాలంపల్లి. రావిపాలెం. సిరిపూరం.గోప్పురు. పిట్టగెడ్డ.గ్రామాలలో కేజీ జీడీ పిక్కలకు ప్రభుత్వ మద్దతు ధర 200/ రూ.,ఇవ్వాలని ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాలు ద్వారా కోనుగోలు చేయాలని. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి గిట్టు బాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జాలంపల్లి పంచాయతీ లో గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు విరిగి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి. ఇరట.నరసింహమూర్తి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కే. భవాని. పల్గోని మాట్లాడారు జీడి పిక్కలు 80 కేజీల బస్తా 18000 మద్దతు ధర ఇవ్వాలి. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. జీడి పంట విస్తరణకు మరియు నిర్వహణకు గతంలో ఇచ్చిన రాయితీలు పునరుద్ధరించాలి. జీడి తోటలలో అంతర కృషి పరికరాలు ఉచితంగా రైతులకు అందించాలి. జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలి. ఉపాధి హామీ పథకం ద్వారా జీడి తోట అభివృద్ధికి రైతులకు జీడి తోటలలో పనులు కల్పించాలి. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలి. రైతు వారి సాగు విస్తీర్ణం నమోదు చేసి జీడి పంటకు వాతావరణ భీమా అమలు చేయాలి. జీడిపంట ప్రాంతాల్లో జీడి పిక్కలు జీడి పండ్లు ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు ప్రభుత్వం వరి, చెరకు, పత్తి మొదలగు పంటలకు మద్దతు ధర ప్రకటిస్తుందని కాని జీడి పంటకు మాత్రం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించక పోవడం అన్యాయమన్నారు అసెంబ్లీ సమావేశాల్లో జీడీ మద్దతు ధర మార్కెట్ సౌకర్యం కోసం చర్చించాలని కోరారు.జీడీ పంటకు నిలకడగా ధర ఉండక పోవడంతో జీడిపిక్కల పంట సమయంలో వ్యాపారులు రైతులకు ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేసారు మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జీడి రైతులకు న్యాయ మైన ధర చెల్లించి, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు మన దేశంలో జీడి సాగులో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని. అనకాపల్లి జిల్లాలో 90 వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారనీ వేలాది మంది రైతులు గిరిజనులు ధళితులు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. 25 వేల మెట్రిక్ టన్నులు జీడి పిక్కలు ఉత్పత్తి జరుగతుందని తెలిపారు. నాన్ షేడ్యూల్డ్ గిరిజన, తీర ప్రాంతంలో నీటి వనరులు లేని మెట్ట ప్రాంతంలో జీడి పంట ప్రధానమైన వాణిజ్య సాగుగా రైతులు పండిస్తున్నారని తెలిపారు జీడి పంట విస్తరణ, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో. జీడి రైతుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదలకుండా జీడి పిక్కల గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు ఈ కార్య క్రమంలో కటిక. దేముడు. గిన్నిపల్లి సన్యాసమ్మ. చెప్పాడ. మారయ్య. కటిక.శాంతి. గణేష్. లింగరాజు. డి బోడిదొర. జీడి రైతులు తదితరులు పాల్గొన్నారు

# అలుగు ప్రభాకరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

### - ఎలమంచిలి పరిశ్రర ప్రాంతాల్లో నిరుపేదలకు ఆహారం మరియు నిత్యవసర సరుకులు పంపణి



**అచ్చుతాపురం ఫిబ్రవరి 24 మేజర్‌న్యూస్:** కీర్తిశేషులు అలుగు ప్రభాకర్ రావు చారిటబుల్ ట్రస్ట్, ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలో నివాసం ఉంటున్న వారి ప్రధమ కుమార్తె రూప యుంగ్ మరియు వారి అల్లుడు మన్ యుంగ్ గార్ల సహకారంతో ప్రతి మంగళవారము అచ్యుతాపురం అనకాపల్లి ఎలమంచిలి పరిశర ప్రాంతాలలో పేదవారికి, వృద్ధులకు ఆహార పంపిణీ మరియు ప్రతి నెల పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయుచున్నారు. స్థానికంగా ఆర్కే మహేష్, శశాంక్ మరియు ప్రభాకర్ ఫిలదెల్ఫియా చర్చి వారి సహకారంతో అనేక సేవ కార్యక్రమాలు జరిగిస్తున్నారు.

# అంతర్ జిల్లాల దొంగ అరెస్టు

### - 87.70 గ్రాముల బంగారం స్వాధీనం - 42 చీటింగ్ కేసుల్లో నిందితుడు - ఒంటరి మహిళలు, వృద్ధులు భద్రత పాటించాలి - డీఎస్పీ శ్రావణి



**అనకాపల్లి, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరుస దొంగతనాలు చేస్తున్న అంతర్ జిల్లాల దొంగను అనకాపల్లి పోలీసులు అరెస్టు చేశారని అనకాపల్లి సబ్ డివిజినల్ డీఎస్పీ ఎం.శ్రావణి అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను వివరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రధానంగా ఉభయ గోదావరి, కోనసీమ, ఉమ్మడి విశాఖపట్నం తదితర జిల్లాల్లో సుమారు 42 కేసులలో ముద్దాయైన ఎల్లమెల్లి వెంకటరమణ అలియాస్ కిషోర్ విశాఖపట్నం జిల్లా పోతిన మల్లయ్యపాలెం హెచ్బీ కాలని నేటీవ్ ఆఫ్ శివకొండపాలెం, రాజోలు మండలం, కోనసీమ జిల్లా నివాసిని అనకాపల్లి రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్డు వద్ద సాయంత్రం నాలుగు గంటలకు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచామన్నారు. అనకాపల్లి జిల్లాలో గత సంవత్సరం డిసెంబర్ నెలలో పట్టణంలోని కర్ణాలు వీధి దగ్గర సచివాలయం ఉద్యోగిని అని చెప్పి ఇళ్లు అద్దెకు కావాలని చెప్పుతూ ఫించన్ ఇప్పిస్తానని, ఫోటో అండ్ ఫింగర్ ప్రింట్ తీసుకోవాలని నమ్మబలికి మెడలో బంగారం త్రాడు పట్టుకొని వెళ్లిపోయినట్లు సదరు మహిళ ఫిర్యాదు చేసిందని, అలాగే నవంబర్ నెలలో ఎస్.రాయవరం మండలం, కొత్రపోలు గ్రామంలో సచివాలయం ఉద్యోగినని చెప్పి ఒక మహిళ నుంచి బంగారు నల్లపూసలు త్రాడుని తస్కరించినట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అతని వద్ద నుంచి బంగారం త్రాడు గ్రా. 33.21, రెండు బంగారు మంగళ సూత్రాలు గ్రా.22.85, నల్లపూసలు గ్రా. 31.70 వెరసి 87.70 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఒంటరి మహిళలు, వృద్ధులు తగు జాగ్రత్తలు వహించాలని, భద్రత విషయంలో పోలీసులను సంప్రదించాలని ముఖ్యంగా ప్రభుత్వ సిబ్బంది అనగా సచివాలయం, పెన్షన్ అంటూ ఎవరైనా వస్తే సమీపంలోని ఇరుగుపోరుగు వాళ్ల సహాయం తీసుకోవాలని లేదా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రేమ కుమార్, ఎస్ఐలు కె.సంతోష్ కుమార్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, పీసీలు ఎం.సముద్రం, అర్పీ నాయుడు, టీ ఎస్ నాయుడు పాల్గొన్నారు.

# ఘనంగా తలుపులమ్మ తల్లి పండుగ



**గొలుగొండ, పిబ్రవరి 24, మేజర్‌న్యుస్:** గొలుగొండ మండలం నర్సింగపల్లి గ్రామం లో తలుపులమ్మ తల్లి పండుగను ఘనంగా మంగళవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో భక్తులకు తలలు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు... ప్రతి సంవత్సరం జరిగే ఈ పండుగలో అమ్మవారి ఘటాలు అలయం వద్ద నుంచి ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారిని ఇంటిఇంటికి డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల తో ఘనంగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో సాంస్కృతి కార్యక్రమలు డాన్స్ బేబీ డాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేసారు..